ఆగస్టు 2019

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి : 02 సంచిక : 09

పేజీలు : 60

## జల వనరుల సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత






స్వయం సహాయక బృందాలకు బ్యాంక్ లింకేజ్ అంశంపై సెర్ప్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు




కూరగాయలు అమ్మకాలు మరియు మార్కెటింగ్‌పై కొనుగోలుదారులకు మరియు అమ్మకందారులకు టిఎస్ఐఆర్‌డిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ వికాస్‌రాజ్, ఐఏఎస్



టి.ఎస్.ఐ.ఆర్.డి. సందర్శనకు విచ్చేసిన కర్ణాటక రాష్ట్ర మైసూర్ జిల్లా పంచాయితీ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాలు మరియు టి.ఎస్.ఐ.ఆర్.డి.లో నిర్వహించే శిక్షణా కార్యక్రమాల గూర్చి వివరిస్తున్న టి.ఎస్.ఐ.ఆర్.డి. ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్

## టి.ఎస్.ఐ.ఆర్.డి

**TSIRD**

# స్థానిక పాలన

సంపుటి : 02 సంచిక : 09

ఆగస్టు 2019

ఎడిటర్

**పౌసమి బసు**, ఐ.ఏ.ఎస్.

సిఇఓ, టిఎస్ఐఆర్‌డి



ఎడిటోరియల్ బోర్డు

**ఇ.ఆర్. బి. నరేంద్రనాథ్ రావు**

**పి.రవీందర్**

**ఇ. అనిల్‌కుమార్**

**జి. వెంకటసూర్యారావు**

**జి. జయపాల్‌రెడ్డి**

**ఎ.నాగేశ్వరరావు**

**ఎస్. వెంకటేశ్వర్ రావు**



కాన్సెప్ట్, ప్లానింగ్, ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, టిఎస్ఐఆర్‌డి మరియు నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

Online Publications

**టిఎస్ఐఆర్‌డి**

రాజేంద్రనగర్

హైదరాబాద్ - 500 030

తెలంగాణ, ఇండియా.

ఫోన్ : 040 - 24018656

ఫ్యాక్స్ : 040 - 24017005

E-mail:editorsthanikapalana@gmail.com

Website: www.tsird.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిఎస్ఐఆర్‌డికిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


జలశక్తి అభియాన్ ........ 5

తెలంగాణకు హరితహారం ........ 8

"అవినీతి నిర్మూలనకు లోక్‌పాల్" ........ 12

పండ్లకు కృత్రిమంగా మాగాబెట్టడానికి వినియోగించే క్యాలిషియం కార్బైడ్ వల్ల కలిగే నష్టాలు మరియు వాటికి ప్రత్యామ్నాయాలు ........ 14

నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన ........ 17

తిమయ్యపల్లి - నీటి సంరక్షణలో ముందంజ ........ 19

నిర్దిష్టమైన లక్ష్యంతో కొత్త బంగారు లోకం ........ 20

పశుపోషణతో జీవనోపాధి ........ 22

మహబూబ్‌నగర్ జిల్లా పేరూర్ గ్రామము - ఒక విజయగాథ ........ 23

ఇంధనం వృథా - పర్యావరణానికి వ్యథా! ........ 25

సంచార పశువైద్య సేవలు - 1962 ........ 26

ఇంటికో ఇంకుడు గుంత - భూగర్భ జలం మన చెంత ........ 29

కొత్తిమీర లాభాల ధార ........ 30

సస్యరక్షణ మందులు మరియు జీవ రసాయనాల కొనుగోలు, వాడకంలో పాటించవలసిన మెలుకువలు ........ 31

చిన్నకారు రైతు పర్వతయ్య గొర్రెల కాపరిగా మారిన వైనం ........ 33

ఆదివాసీల సంస్కృతీ సాంప్రదాయాలు ........ 34

"మిషన్ భగీరథ"పై టి.ఎస్.ఐ.ఆర్.డి.లో శిక్షణా కార్యక్రమం ........ 38

పంచాయతీరాజ్ వ్యవస్థ - ఆవిర్భావం ........ 39

ఇ- వ్యర్థాల ద్వారా దేశానికి పెద్ద అనర్థం ........ 40

మల్బరీ సాగుతో కరువుకు చెక్! ........ 42

టి.ఎస్.ఐ.ఆర్.డి.లో గిరిజన ప్రాంత సర్పంచులకు పెసా చట్టంపై శిక్షణా కార్యక్రమం 43

# జల వనరుల వినియోగం

నీటి వివాదాలు ఈనాడు క్రొత్తకాదు. పెరుగుతున్న జనాభాతో పాటు లోపభూయిష్టమైన నీటి యాజమాన్య విధానముల వలన విలువైన నీటి వనరు కరువవుతున్నది.

వాతావరణములో వస్తున్న మార్పులు మరియు కలుషితమవుతున్న నీటి వలన డిమాండ్, సప్లయ్‌ల మధ్య అంతరం పెరుగుతున్నది. నాటి నైలునది వివాదము మొదలుకొని నేటి కావేరీ జల వివాదము వరకు మంచినీటి వనరుల వినియోగము సమస్యగానే మిగిలిపోయినది.

సమస్య జటిలముగా ఉన్నప్పటికినీ నీటి దుర్వినియోగమును అరికట్టడము మరియు సమృద్ధిగా నీటి వనరులు పెంచి వాటిని సద్వినియోగము చేసుకోవడానికి, చేయవలసిన కృషియే నేడు ప్రపంచ దేశాల ముందు ఉన్న ప్రధాన సవాలు.

తెలంగాణ రాష్ట్రములో ప్రజలందరికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్న సత్సంకల్పమే, ప్రభుత్వ విధానముగా "మిషన్ భగీరథ" బృహత్ పథకము ప్రవేశపెట్టడము. నీటి వనరుల డిమాండ్ వినియోగములను అంచనావేసి నిర్వహణ తీరును అధ్యయనం చేసి రూపకల్పన చేసిన పథకం "మిషన్ భగీరథ"

అధిక వర్షపాత నమోదు కొరకు తద్వారా నీటి వనరులను పెంచడానికి, ప్రజల భాగస్వామ్యముతో "హరితహారము" కార్యక్రమము ద్వారా విస్తృతంగా విస్తారంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించి గత అయిదేళ్ళలో అయిదు విడతలుగా కొనసాగించి కోట్లాది మొక్కలు ఉధృతంగా నాటడం జరుగుచున్నది.

వీటితో పాటుగా భారీ ప్రాజెక్టులు, నీటి నిల్వ రిజర్వాయర్లను మరియు నీటి వనరుల అవకాశములను పెంపొందించడము జరిగినది. ఉదా:– మిషన్ కాకతీయ

కానీ వినియోగదారులందరికీ త్రాగునీటి సరఫరా సక్రమముగా అందేలా మిషన్ భగీరథ పథకమును పటిష్టముగా అమలు జరపడములో స్థానిక సంస్థలు క్రియాశీలకముగా బాధ్యత వహించవలసి వుంటుంది. ప్రజలలో సామాజిక స్పృహను పెంచడమే కాక త్రాగునీటి వనరుల ఆవశ్యకతను వారిలో పెంపొందించడము మంచినీటి సద్వినియోగముపై చైతన్యము తీసుకువస్తే సత్ఫలితాలు పొందవచ్చును.

స్థానిక పాలన ప్రస్తుత సంచికలో త్రాగునీటి వనరుల పటిష్ట నిర్వహణపై దృష్టి కేంద్రీకరించడము జరుగుచున్నది.

(పోసమి బసు)

# జలశక్తి అభియాన్

ప్రకృతి మానవునికి పుష్కలముగా సహజ వనరులను అందించింది. వీటిని ఎంత ఔచిత్యంగా ఉపయోగించుకోవాలనేది. మానవుని విచక్షణ పైన ఆధారపడి ఉంది. ఇందులో ముఖ్యమైనది నీరు. భూమి పైన మంచినీటి లభ్యత అపరిమితమైనది కాదు. మనందరికి తెలుసు, నీటి కొరత వలన ప్రపంచములో ఎన్నో నాగరికతలు కాలగర్భంలో కలిసిపోయినవి.

భూమిపైన నీరు హైడ్రాలాజికల్ చక్రం ద్వారా స్థానచలనం పొందుతుంది. అనగా భూమి ఉపరితలముపైన

## హివరే బజార్ సక్సెస్ స్టోరీ





హివరే బజార్ అనే గ్రామము మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో కలదు. ఇది చాలా కరువుతో అల్లాడిన ప్రాంతము. ఇక్కడ సాధారణ వర్షపాతం 300 ఎం.ఎం. మాత్రమే. ఇక్కడ నీటి కరువు వలన వ్యవసాయ భూములు బంజరు భూములుగా మారినవి. ప్రజలు ఇతర ప్రదేశములకు జీవనాధారము కొరకు వలసపోయినారు. ఇది 1990 సం॥ పూర్వము గ్రామ పరిస్థితి.

మరి నేడు దేశంలో ఇది ఒక సంపన్నమైన గ్రామము. ఈ గ్రామ జనాభా 1250. అందులో 60 మంది మిలియనేర్ రైతులు ఉన్నారు. ఈ గ్రామంలో దారిద్ర రేఖకు దిగువున ఏ కుటుంబము లేదు. మార్కెట్లు, రోడ్లు, పక్కా గృహాలు కలిగి ఉండడము ఈ గ్రామ ప్రత్యేకత. ఇట్టి మార్పునకు బీజం 1989వ సం॥లో, అప్పటి సర్పంచుగా ఎన్నిక కాబడిన పోపట్‌రావు పవార్ ఆధ్వర్యంలో పడింది.

దేశంలోని అన్ని గ్రామాల వలె ఒకప్పుడు ఉన్నటువంటి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు తమ భాగస్వామ్యంతో సామూహిక నిర్ణయాలు తీసుకొని వారి భవిష్యత్తుకు బంగరు బాటలు వేసుకున్నారని చెప్పాలి. ఈ గ్రామంలో బహిరంగ మల విసర్జన, పోగాకు వాడకము మరియు మద్యపాన నిషేధం విధించనైనది. చెట్ల నరికివేతను, పశువులు గుట్టలపైన మేపడం, వ్యవసాయానికి బోర్‌వెల్ వాడకం నిషేధించనైనది. ఇవి అన్ని కూడ ప్రజల అంగీకారంతో చేసినవని గుర్తించాలి. పెద్దఎత్తున నీటి సంరక్షణ చర్యలు చేపట్టి అటవీ విస్తరణ చర్యలు తీసుకున్నారు.

ఈ గ్రామంలో ప్రత్యేకంగా నీటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ బడ్జెట్‌లో నీటి లభ్యత, నీటి అవసరాలు (గృహ మరియు వ్యవసాయ) లెక్కించడం జరుగుతుంది. ఈ గ్రామంలో నీరు ఎక్కువగా ఉపయోగించుకునే పంటలను సాగు చేయరు. కూరగాయలు, పప్పుదినుసులు, పూలు, పండ్లు వంటి నీటిని







తక్కువగా వినియోగించే పంటలను సాగు చేస్తారు. ఒకప్పుడు దరిద్రం తాండవించిన చోట ధనలక్ష్మి సిరులు కురుపిస్తుంది. వలస వెళ్లిన ప్రజలు తిరిగి వారి స్వస్థలాలకు తిరిగి వచ్చారు. దీని వలన మనము గమనించవలసినదేమిటంటే ప్రతి గ్రామంలో పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, సమిష్టిగా నిర్ణయాలు తీసుకొని, నీటి సంరక్షణ చర్యలు చేపడితే ఎంతటి కరువునైనా జయించవచ్చు.

ఉన్న నీరు ఆవిరిగా మారి, అది మేఘాలుగా ఏర్పడి, వాన రూపంలో, మంచు రూపంలో తిరిగి భూమి మీదకు వస్తుంది. ఇలా భూమి మీద పడిన మంచు, వర్షం నదులలో, చెరువులలో మరియు ఇతర నీటి నిలువ కుంటలలో చేరుకుంటుంది. నేల లోపల కూడా ఇంకుతుంది. ఇలా నేలలో ఇంకిన నీరు, నేలలో తేమగా, భూగర్భ జలంగా ఉంటుంది.

కాని నేడు మనదేశంలో నీటి వనరుల లభ్యతపై ఈ క్రింది ముఖ్యమైన ఆందోళనలు కలుగుతున్నవి.

1. నీటి వనరుల అసమర్థ నిర్వహణ
2. నీటి కొరకు ఎక్కువ డిమాండ్
3. భూగర్భ జలాలను అధికంగా వెలికితీయడం
4. సంప్రదాయకమైన నీటి వనరులను ఆక్రమణ
5. వ్యవసాయమునకు నీటిని అసమర్థంగా వాడడం.
6. నీటి వనరుల కాలుష్యం
7. అనిశ్చిత రుతుపవనాలు

పైన పేర్కొన్న బడిన విషయాలను దృష్టిలో పెట్టుకొని, గౌ॥ ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారు రెండవ సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసినారు. నీటి సమస్య సమగ్ర పరిష్కారము కొరకు 'జలశక్తి అభియాన్' అనే కార్యక్రమాన్ని తీసుకోవడము జరిగింది.

జలశక్తి అభియాన్ కార్యక్రమము రెండు విడతలుగా జరుగుతుంది. దేశంలోని నీటికొరత ఎదురుకుంటున్న 256 జిల్లాలలోని 1592 బ్లాకులలో ఇట్టి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుంది. మొదటి విడత 1 జూలై 2019 నుండి 15 సెప్టెంబర్ 2019 వరకు అన్ని రాష్ట్రాలలో చేపడుతారు. రెండవ విడత, తిరోగమన రుతుపవనాల ప్రభావం కలిగిన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలలో 1 అక్టోబర్ 2019 నుండి 30 అక్టోబర్ 2019 వరకు చేపడతారు.

ఈ ప్రచార కార్యక్రమములో కేంద్ర ప్రభుత్వ అధికారులు, భూగర్భజల నిపుణులు మరియు శాస్త్రవేత్తలు రాష్ట్ర మరియు జిల్లా అధికారులతో కలిసి పనిచేస్తారు. వీరు ముఖ్యంగా నీటికొరత ఎదురుకుంటున్న జిల్లాలలో నీటి సంరక్షణ మరియు నీటి వనరుల నిర్వహణపై దృష్టిపెడుతూ ఐదు విషయాలపైన ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవడము జరుగుతుంది.

**జలశక్తి అభియాన్‌లో చేపడుతున్న ఐదు ప్రత్యేక కార్యక్రమాలు**


నీటి నిలువ గుంత



1. నీటి పరిరక్షణ & వర్షపు నీరు సంరక్షణ



2. సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరన



3. నీటి పునర్వినియోగం & నీటి సంరక్షణ నిర్మాణాల రీచార్జ్



4. వాటర్‌షెడ్ అభివృద్ధి



5. ముమ్మరంగా చెట్లు నాటడం.

**పైన పేర్కొనబడిన సంరక్షణ పనులకు అనుబంధముగా ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.**

1. జిల్లా మరియు బ్లాకు నీటి సంరక్షణ ప్రణాళికలు తయారు చేయుట
2. క్రిషి విజ్ఞాన కేంద్ర మేళాల ద్వారా వ్యవసాయానికి సమర్ధవంతమైన నీటి వినియోగ పద్ధతులు తెలియచెప్పడం మరియు నీటి సంరక్షణకు అనువైన పంటల గురించి వివరించడము.
3. పట్టణాలలో వ్యర్ధ నీరును వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి పునర్వినియోగించుట కొరకు ప్రణాళికలు తయారు చేయడం.
4. జాతీయ స్థాయిలో ఐఐటిలు మరియు శాస్త్రవేత్తలు, నీటి సంరక్షణ టీం లకు తోడ్పాటునందించడము.
5. సమర్ధవంతమైన ప్రణాళిక తయారు చేయుటకు 3డి కాంటోర్ మ్యాప్స్ తయారు చేయుట.

ఈ కార్యక్రమము సఫలం కావడానికి గ్రామ పంచాయతీల తోడ్పాటు ఎంతో అవసరం. గ్రామసభలలో నీటి సంరక్షణ పైన పెద్ద ఎత్తున చర్చ జరగడము అవసరము. ప్రతి గ్రామ పంచాయతీ నీటి వనరుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలలో చైతన్యం తీసుకురావాలి. ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్ తయారు చేసుకొని, దానికి అనుగుణంగా వ్యవసాయ పంటలు పండించాలి. గ్రామస్తుల సహకారంతో, హివరే బజారే, రాలేగావ్ సిద్ధి వంటి గ్రామాలు ఏళ్ళతరబడి ఉన్నటువంటి కరువుని జయించి ఇతర గ్రామాలకు మార్గదర్శకం అయ్యాయి.

మన గ్రామం, మనదేశం నీటి సమస్యను అధిగమించాలంటే మహాత్మాగాంధీ ఈ విధంగా అన్న మాటలు గుర్తుపెట్టుకోవాలి.

"ప్రతి మనిషి అవసరాలను తీర్చడానికి భూమిపైన వనరులు ఉన్నాయి. కాని ప్రతి మనిషి దురాశలను తీర్చడానికి మాత్రం లేవు".

కావున ప్రతి ఒక్కరు చిన్న, పెద్ద, ఆడ, మగ, పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా నీటి సంరక్షణ కర్తవ్యంగా భావిస్తే ప్రతి గ్రామం హివరే బజార్ లేక రాలేగావ్ సిద్ధి అవుతాయి అనడంలో సందేహం లేదు. ఇట్టి సత్కార్యానికి నడుము కట్టిన మన ప్రధానమంత్రి గౌ॥ శ్రీ నరేంద్రమోడీ గారు అభినందనీయం.

**- ఎస్. వెంకటేశ్వర్‌రావు,**
**సెంటర్ హెడ్, ఎం & పి. టి.ఎస్.ఐ.ఆర్.డి.**

# తెలంగాణకు హరితహారం




## ఐదవ విడత

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో హరితహారం ఒకటి. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 24 శాతం పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేందుకు... తద్వారా పర్యావరణాన్ని కాపాడేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ ఈ బృహత్తర కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. తెలంగాణను అందమైన, ఆరోగ్యకరమైన, అత్యంత నివాసయోగ్యమైన రాష్ట్రంగా మార్చాలనే ప్రయత్నమే తెలంగాణకు హరితహారం. ప్రస్తుతం పెరుగుతున్న భూతాపాన్ని నియంత్రించటం, రానున్న తరాలకు ఆస్తి, ఐశ్వర్యాల కంటే మంచి ఆరోగ్యకరమైన వాతావారణాన్ని అందించటమే లక్ష్యంగా హరితహారం కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగేళ్లు పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం, వరుసగా ఐదవ ఏడాదిలోకి అడుగుపెట్టింది.

తెలంగాణ వ్యాప్తంగా 230కోట్ల మొక్కలను నాటడమే లక్ష్యం.ఇప్పటికే నాలుగు దశల్లో పూర్తయిన హరితహారం కార్యక్రమం. 2015-16- నాటిన మొక్కలు 15.86 కోట్లు2016-17- నాటిన మొక్కలు 31.67 కోట్లు 2017-18 - మొక్కలు 34.07 కోట్లు, 2018-19 - నాటిన మొక్కలు కోట్లు, మొత్తం నాలుగు విడతల్లో నాటిన మొక్కల సంఖ్య - 113.58 కోట్లు.

ఐదవ విడతలో (2019-20) నర్సరీల్లో పెంచేవి - 100 కోట్ల మొక్కలురాష్ట్ర వ్యాప్తంగా ఐదవ విడతలో నాటే మొక్కల లక్ష్యం -83.30 కోట్లుశాఖల వారీగా నర్సరీల్లో మొక్కలు పెంచే లక్ష్యం. పంచాయితీ-గ్రామీణాభివృద్ధి శాఖ - 53 కోట్లు మున్సిపల్- పట్టణాభివృద్ధి శాఖ - 15 కోట్లు జీహెచ్ఎంసీ - 03 కోట్లు హెచ్ఎండీఏ -07 కోట్లు ,అటవీ శాఖ -22 కోట్లు మొత్తం- 100 కోట్లు జిల్లాల వారీగా కలెక్టర్ నేతృత్వంలో కమిటీలో ఆయా జిల్లాల్లో నాటాల్సిన మొక్కలు, ఖాళీ స్థలాలను గుర్తిస్తాయి. మొత్తం 83. 30 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం.

| అత్యధిక మొక్కలు నాటాల్సిన జిల్లాలు | టార్గెట్ తక్కువగా ఉన్న జిల్లాలు |
|---|---|
| నిజామాబాద్ - 4. 84 కోట్లు | మేడ్చల్ - 81.24 లక్షలు |
| నల్లగొండ - 4.02 కోట్లు | ములుగు - 89.50 లక్షలు |
| సిద్దిపేట - 3.85 కోట్లు | అసిఫాబాద్ -1.23 కోట్లు |

### ఐదవ విడత హరితహారం - ప్రత్యేకతలు

1) జంగల్ బచావో - జంగల్ బడావో (అడవిని కాపాడుదాం - అడవిని విస్తరిద్దాం) నినాదం.
2) ఆగ్రో ఫారెస్ట్రీకి అధిక ప్రాధాన్యత, రైతులకు అదనపు, ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల పెంపు.
3) జూలై రెండవ వారంలో ఐదవ విడత తెలంగాణకు హరితహారం మొదలయ్యే అవకాశం.
4) ఐదవ విడతలో గంధం, టేకు, వెదురు, సరుగుడు, చింత,పూలు, పండ్ల మొక్కలకు ప్రాధాన్యత.
5) టిషఽ్య కల్చర్ విధానంలో ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన వంగడాల మొక్కలు.
6) నర్సరీల్లో వంద కోట్ల మొక్కల పెంపకం, 83 కోట్ల మొక్కలు నాటే భారీ లక్ష్యం.
7) స్కూళ్లు, కాలేజీలు, సంక్షేమ హాస్టళ్లు, యూనివర్సిటీ క్యాంపస్ లు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో

హరితహారం.

8) ఇంటింటికి ఆరు మొక్కలు ఇవ్వటం, బాధ్యతగా పెంచేలా పంచాయితీల పర్యవేక్షణ.

9) కోతుల బెడద నివారణ కోసం ప్రత్యేకంగా గుర్తించిన 37 రకాల మొక్కల జాతులను క్షీణించిన అటవీ ప్రాంతాల్లో నాటే ప్రణాళికలు. (Wild Fruit bearing)

10) వానలు వాపస్ రావాలి - కోతులు అడవులకు వాపస్ పోవాలనే లక్ష్యం.

11) గత నాలుగు విడతల్లో నాటిన ప్రాంతాల్లో చనిపోయిన, సరిగా ఎదగని మొక్కలను గుర్తించి మార్పు చేయటం. (గ్యాప్ ఫిల్లింగ్)

12) కేంద్ర ప్రభుత్వ బ్యాంబూ మిషన్ ( వెదురు ప్రోత్సాహక సంస్థ) సహకారంతో చిన్న, సన్నకారు రైతులకు ఆదాయ



వనరుగా వెదురు పెంపకం హరితహారం కింద ప్రోత్సాహం.

13) హరిత తెలంగాణ, ఆరోగ్య తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో ప్రత్యేకంగా హరితహారం, పట్టణ ప్రాంత వాసులకు స్వచ్ఛమైన గాలిని అందించే ప్రాంతాలుగా 76 ఫారెస్ట్ బ్లాకుల అభివృద్ధి.

14) ఇప్పటివరకు హరితహారం కోసం రూ. 3,350 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.(అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి (ఉపాధిహామీ), జీహెచ్ఎంసీ, హెచ్ ఎం డీఏ నిధులు కలిపిన మొత్తం)

**గత నాలుగు విడతల హరితహారం - వివరాలు**

హరితహారం కార్యక్రమం 2015 జులై 3న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ దేవాలయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ చేతులమీదుగా అధికారికంగా ప్రారంభమైంది.

రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలను నాటి,పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో కేసీఆర్ సర్కార్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2015-16 లో 40 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం కాగా... వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా 15.86 కోట్ల మొక్కలు నాటడం జరిగింది.

కార్యక్రమం ప్రారంభమైన మరుసటి ఏడాది అంటే.. 2016-17 లో వర్షాలు మెరుగ్గా కురవడంతో 31.67 కోట్ల మొక్కలు నాటారు. విజయవాడ హైవే పై 163 కిలో మీటర్ల పొడుగునా మానవహారంగా హరితహారం జరిగింది, సీ.ఎం కేసీయార్ చిట్యాల సమీపంలో జులై 8 న రెండో విడత హరితహారం ప్రారంభించి, పాల్గొన్నారు. నేషనల్ హై వే వెంట నాటిన ఈ మొక్కలన్నీగత మూడేళ్లలో పెరిగి పెద్దవై అహ్లాదాన్ని పంచుతున్నాయి. విజయవాడ జాతీయ రహదారి వెంట ప్రయాణం చేస్తున్న ప్రతీ ఒక్కరూ మొక్కల పెంపకంలో అటవీ శాఖ కృషిని ప్రశంసిస్తున్నారు.

హరితహారం 3 వ దఫా మొక్కలు నాటే కార్యక్రమం ముఖ్యమంత్రి కేసీఆర్ జూలై 12, 2017 న కరీంనగర్ లోప్రారంభించారు. పట్టణంలో లక్ష మొక్కలు నాటడం, పెంచటం దీని ద్వారా ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 34 కోట్ల మొక్కలు నాటడం పూర్తయింది.

హరితహారం నాలుగో విడత ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం గజ్వేల్ లో ఒకే రోజు లక్షకు పైగా మొక్కలు నాటడం ద్వారా ఆగస్టు ఒకటిన - 2018 అధికారికంగా మొదలైంది.

ఒకే రకం చెట్లు కాకుండా నీడనిచ్చేవి, పండ్లు-పూల చెట్లు, ఔషధ మొక్కలను కూడా గత మూడేళ్లలో నాటారు. అటవీ ప్రాంతంలోనే కాకుండా అన్ని రహదారులకు ఇరువైపులా, విద్యాలయాల్లో, పోలీస్ ప్రాంగణాల్లో, మార్కెట్ యార్డుల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో, శ్మశాన వాటికలు, పరిశ్రమల్లో, పారిశ్రామిక వాడల్లో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో మొక్కలు నాటారు.

ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ శాఖలు, పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, డ్వాక్రా మహిళలతో సహా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-ముంబాయి, హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్-నాగపూర్ వంటి జాతీయ రహదారులకిరువైపులా పెద్ద పూల చెట్లు నాటారు. ఈ సారి కూడా ఈ రహదారుల వెంట మిగిలిన ప్రాంతాల్లో హరితహారం చేపట్టనున్నారు.పట్టణ ప్రాంతాలతో పాటు, ప్రతీ గ్రామానికి దారి తీసే రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మున్సిపాలిటీలు, అన్ని పంచాయితీ రోడ్ల వెంట నీడను ఇచ్చే మొక్కలతో పాటు, పూలతో ప్రయాణం అహ్లాదంగా ఉండాలనే స్ఫూర్తితో ఈ ప్రణాళిక అమలు కానుంది. ఇప్పటిదాకా రాష్ట్ర వ్యాప్తంగా 7, 409 కిలో మీటర్ల మేర రహదారుల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ పూర్తయింది.

కొత్త పంచాయితీ రాజ్ చట్టాన్ని తీసుకువచ్చిన ప్రభుత్వ పచ్చదనం పెంపు, మొక్కలు నాటడాన్ని తప్పనిసరి చేస్తూ, ప్రతీ గ్రామ పంచాయితీకి ఒక నర్సరీ ఏర్పాటును కూడా ప్రతిపాదించింది. ఈ ఏడాది నుంచే 2019 నుంచి గ్రామానికి ఒక సర్సరీ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకున్నారు.గ్రామానికి ఒక నర్సరీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ప్రకారం 12, 571 గ్రామ పంచాయితీలకు గాను, 11, 944 నర్సరీల ఏర్పాటయ్యాయి. అటవీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల సమన్వయంతో నర్సరీల ఏర్పాటు జరుగుతోంది. పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం మొక్కల రక్షణకు బాధ్యత వహించని వ్యక్తులు, సంస్థలపై తగిన చర్యలను కూడా ప్రభుత్వం చట్టంలో ప్రతిపాదించింది. అస్థిపన్నుకు సమానమైన ఫైన్ విధించే అవకాశముంది.

తెలంగాణ వ్యాప్తంగా ఐదేళ్ల కాలంలో 230 కోట్ల మొక్కలు నాటి, వాటిని సంరక్షించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అంకురార్పణ చేసిన హరితహారం కార్యక్రమంలో... అటవీ ప్రాంతంలో 100 కోట్ల మొక్కలు, సామాజిక అడవుల కింద 120 కోట్ల మొక్కలను ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో... మరో 10 కోట్ల మొక్కలను జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏ పరిధిలో నాటనున్నారు. అటవీ పునరుజ్జీవన చర్యల్లో భాగంగా క్షీణించిన అడవులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ నేలలు, అడవులకే ప్రత్యేకమైన స్థానిక జాతుల మొక్కలను నాటడం ద్వారా అటవీ పునరుజ్జీవన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అలాగే హరితహారంలో సుమారు 55 శాఖల దాకా పాల్గొంటున్నాయి. వర్షాల సీజన్ లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనే హడావిడి చేయటం మాత్రమే కాకుండా, ఏడాది పొడగునా మొక్కల సంరక్షణకు ఆయా శాఖలు బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రక్షణ చర్యలు చేపట్టడం, నీటి సౌకర్యం కల్పించటం, మొక్కలు నాటిన ప్రదేశాలను జియో



ట్యాగింగ్ చేయటం, అటవీ శాఖ నిర్వహిస్తున్న వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయటం చేయాలని, తద్వారా నిరంతరం పర్యవేక్షణ సాధ్యం అవుతుందని శాఖాధిపతులకు చీఫ్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతీ నెలా ఆ మొక్కల ఎదుగుదలను, బతికిన మొక్కల శాతాన్ని నమోదు చేయాలని సూచించారు. ప్రతీ డిపార్ట్ మెంట్ ప్రాంతాల వారీగా కొందరు ఉద్యోగులతో బృందాలను ఏర్పాటు చేసి, వారంలో ఒక రోజు మొక్కల పర్యవేక్షణకు కేటాయించాలని తెలిపారు. అలాగే గత నాలుగేళు ్లగా మొక్కలు నాటిన ప్రాంతాల్లో, చనిపోయిన మొక్కలను గుర్తించి కొత్త వాటిని నాటాలని (గ్యాప్ ఫిల్లింగ్) తెలిపారు.

ఇక సామాజిక అడవుల కింద నాటనున్న 120 కోట్ల

మొక్కల్లో... ప్రతి ఏడాది 40 కోట్ల చొప్పున మొక్కలను నాటాలని ప్రణాళిక రూపొందించింది తెలంగాణ ప్రభుత్వం. ప్రతి సంవత్సరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 40 లక్షల మొక్కలను, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 40 వేల మొక్కలను నాటాలని ప్రణాళికను సిద్ధం చేసింది. అందుకనుగుణంగానే ఈ మొక్కలు నాటే కార్యక్రమం ప్రతి ఏడాది జరుగుతూ వస్తోంది.

హరితహారం కార్యక్రమంలో... జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచాయతీరాజ్ రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కల్లో 91 శాతం బతికాయి. అలానే ప్రభుత్వానికి చెంది నిరుపయోగంగా ఉన్న, రక్షిత చర్యలున్న (ఫెన్సింగ్, కాంపౌండ్, నీటి వనరు)ప్రాంతాల్లో నాటిన మొక్కల్లో సుమారు 60 శాతం... ఖాళీ స్థలాలు, పోరంబోకు భూముల్లో నాటిన మొక్కల్లో 53 శాతం మొక్కలు బతికినట్లు ఒక అంచనా.

**మొక్కల రక్షణ చర్యలు, హరితమిత్ర అవార్డులు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని... విస్తృతంగా మొక్కలు నాటడానికి ముందుకు వచ్చే ప్రతి ఒక్కరిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొత్త పథకాన్ని అమలు చేస్తోంది. కనీసం 100 మొక్కలు, అంతకంటే ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటే వ్యక్తులకు, సంస్థలకు... ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రత్యేక కార్యచరణను రూపొందించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి మొక్కకు రూ.5 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. గ్రామ హరిత రక్షణ కమిటీల ద్వారా మొక్కలను నాటే కార్యక్రమాన్ని... మొక్కల సంరక్షణ కోసం చర్యలు చేపడుతోంది.

మొక్కలను నాటడమే కాకుండా.... వాటి సంరక్షణ బాధ్యతను సైతం తెలుసుకునేలా ప్రతీ ప్రాంతంలో ఒక బాధ్యతతో కూడిన టీమ్ లను నియమించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలోంచి పుట్టింది గ్రీన్ బ్రిగేడ్. నాటిన మొక్కల సంరక్షణ స్థానిక ప్రజా ప్రతినిధులు,ప్రజలు తీసుకోవాలని ప్రభుత్వం ప్రత్యేకంగా కోరుతోంది. అన్ని ప్రాంతాల్లో గ్రీన్ బ్రిగేడ్ లను ఏర్పాటు చేసి సంరక్షణ బాధ్యతలు అప్పగించారు.

అదే విధంగా పెద్దఎత్తున మొక్కలు నాటే గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు వివిధ విభాగాల కోటాల నుంచి ప్రత్యేక నిధులను కేటాయించి ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. చెట్లు ఉంటేనే వానలు పడతాయని, మొక్కలు నాటడం వలన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్న అవగాహన ప్రజలలో పెంచేందకు ప్రభుత్వం విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తోంది. మొక్కలు నాటే పౌరులకు, యువజన, ప్రజా సంఘాలను, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు ప్రోత్సాహకాలనుప్రభుత్వం ఇస్తోంది. హరిత మిత్ర అవార్డుల ద్వారా మొక్కలు నాటేవారికి ప్రోత్సహించడమే కాకుండా... లక్ష్యాన్ని మించి మొక్కలు నాటే పంచాయతీలు, వార్డులు, మున్సిపాలిటీలకు రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ప్రోత్సాహకాలను అందిస్తోంది.

ఔత్సాహికులు, స్వచ్ఛంద సంస్థలు విత్తన బంతులు (సీడ్ బాల్స్) ద్వారా హరితహారంలో పాల్గొనే వెసులుబాటు కూడా ఉంది. మట్టిలో విత్తనాలు, ఎరువును జోడించి విత్తన బంతులు తయారు చేస్తారు. వాటిని ఏటవాలుగా ఉండే ప్రదేశాలు, కొండలు, గుట్ట ప్రాంతాల్లో చల్లుతారు. దీంతో ఏటవాలు ప్రాంతాల్లో గుంతలు తవ్వి, మొక్కలను నాటాల్సిన అవసరం ఉండదు. సీడ్ బాల్స్ వాటికవే మొక్కలుగా పెరుగుతాయి.

ఇక హరితహారం ముఖ్య ఉద్దేశం కేవలం పచ్చదనం విస్తీర్ణాన్ని పెంచడమే కాకుండా... సహజసిద్ధమైన అడవులను పరిరక్షించడం, పునరుజ్జీవింపచేయడం, అటవీ భూముల దురాక్రమణను అడ్డుకోవడం.. పెద్ద ఎత్తున సాగే వృక్షాల నరికివేతను నిలువరించడం వంటివి వాటిలో ఉన్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలోని అడవులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. జంగల్ బచావో – జంగల్ బడావో ద్వారా మళ్లీ తెలంగాణ అడవులకు పునర్వైభవం తీసుకువస్తామని సీఎం కేసీఆర్ పదేపదే చెప్తూ వస్తున్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి హరితహారం కార్యక్రమం అమలవుతున్న తీరుపై రెగ్యులర్ గా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు మొక్కలు నాటే కార్యక్రమం, రక్షణ చర్యల వివరాలను తెలుసుకుంటూ.. అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

**పతంగి శంకర్, సీనియర్ జర్నలిస్ట్**

# "అవినీతి నిర్మూలనకు లోక్‌పాల్"






స్వతంత్ర భారతంలో అవినీతి నానాటికి తీవ్ర స్థాయికి చేరి ప్రభుత్వాలు కుంభకోణాలకు నిలయంగా మారిపోతున్న దుస్థితి. నీతి అనేది రాజకీయాలలో కనుమరుగయింది. పరిపాలనలో అవినీతి క్యాన్సర్‌లా విస్తరిస్తోంది. గ్రామపంచాయతీల నుండి పార్లమెంట్ వరకూ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు చట్టం నిర్దేశించిన పరిమితులకు అనేక రెట్లు మించి అధికంగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు ప్రజాప్రతినిధులు మరియు అధికారులు ఆశ్రిత బంధుప్రీతి మరియు అవినీతికి పాల్పడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తున్నారు. బావితరాలకు సుసంపన్న భారతావనిని అందించాలని కలలు కన్న సమరయోధుల కల కలగానే మిగిలిపోయింది.

**తొలి అడుగు స్వీడన్‌లో:**

అవినీతి నిర్మూలన కోసం ప్రజానిఘా సంస్థగా లోక్‌పాల్ వాదన తెరపైకి వచ్చింది. పాలకుల అవినీతి అక్రమాలపై ప్రజలు చేసే ఫిర్యాదుల మీద విచారణ జరపడానికి మొట్టమొదటిసారిగా స్వీడన్ దేశం 1809లో అంబుడ్స్‌మన్ అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. తదనంతరం కాలక్రమంలో 130 పైగా దేశాల్లో ఇటువంటి అంబుడ్స్‌మన్ వ్యవస్థలు ఆవిర్భవించాయి. స్వాతంత్ర్యానంతరం 1966లో మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ఏర్పాటయిన మొదటి పరిపాలనా సంస్కరణ సంఘం దేశంలో పెరిగిపోతున్న అవినీతిని అదుపుచేయడం కోసం కేంద్రస్థాయిలో లోక్‌పాల్ వ్యవస్థను రాష్ట్రస్థాయిలో లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ప్రసిద్ధ న్యాయవాది శాంతిభూషణ్ 1968లో మొదటిసారిగా జనలోక్‌పాల్ బిల్లును ప్రతిపాదించారు. ఈ బిల్లును నాలుగో లోక్‌సభ 1969లో ఆమోదించినా రాజ్యసభ ఆమోదం పొందలేకపోయింది. శ్రీమతి ఇందిరా గాంధీ ప్రభుత్వం 1971లో మురార్జీ దేశాయ్ నాయకత్వంలోని జనతా ప్రభుత్వం 1977, రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1985లో వి.పి.సింగ్ ప్రభుత్వం 1990లో, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1996లో, అటల్‌బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం 1998లో లోక్‌పాల్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినా ఏదో ఒక కారణం వలన లోక్‌పాల్ బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది చట్టంగా మారలేదు. రాజకీయ పార్టీలకూ చిత్తశుద్ధి లేని కారణంగానే ఇంతకాలం లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు కాకపోవడానికి ప్రధాన కారణం.

**అన్నాహజారే ఉద్యమం:**

అవినీతికి వ్యతిరేకంగా ప్రముఖ సామాజిక వేత్త అన్నాహజారే ఉద్యమం చేసారు. అవినీతి నిర్మూలన కోసం లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఉద్యమించారు. ఈ ఉద్యమానికి కేజ్రీవాల్, కిరణ్‌బేడీ లాంటి అనేక మంది ప్రముఖులు మద్దతును ప్రకటించారు. అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమానికి దేశవ్యాప్తంగా మద్దతురావడంతో అధికారంలో ఉన్న (యూపిఏ) మన్మోహన్ సింగ్ ప్రభుత్వం లోక్‌పాల్ సంస్థ ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకతప్పలేదు. యూపిఏ ప్రభుత్వం 2013 డిసెంబర్‌లో లోక్‌పాల్ బిల్లు ప్రవేశపెట్టడం, ఉభయ సభల్లోను ఆమోదం పొంది రాష్ట్రపతి ఆమోదముద్రతో 2014 జనవరి న చట్టంగా మారింది.

**అర్హతలు:**

లోక్‌పాల్ చట్టాన్ని అనుసరించి లోక్‌పాల్ వ్యవస్థలో లోక్‌పాల్ ఛైర్మన్‌తో పాటు గరిష్టంగా ఏనిమిది మంది సభ్యులను నియమించవచ్చు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి లోక్‌పాల్ ఛైర్మన్ పదవికి అర్హులు. లోక్‌పాల్ ఛైర్మన్‌తో పాటు గరిష్టంగా ఎనిమిది మంది సభ్యుల్ని నియమించవచ్చు. సభ్యుల్లో నలుగురికి న్యాయరంగ నేపథ్యముండాలి. కనీసం 50 శాతం సభ్యులు ఎస్సీ, ఎస్టీ, ఓబిసీ, మైనారిటీ, మహిళా వర్గాల నుండి ఉండాలి. ఛైర్మన్ సభ్యుల పదవీకాలం ఐదు సంవత్సరాలు లేదా వారికి 70 సం॥ వచ్చే వరకు ఇందులో ఏది ముందయితే అది. లోక్‌పాల్ వ్యవస్థ ఛైర్మన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమానంగా, సభ్యులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా జీతభత్యాలు చెల్లిస్తారు.

**ఎవరెవరిని విచారిస్తారు:**

ప్రధానమంత్రితో సహా కేంద్రమంత్రులు, పార్లమెంట్ సభ్యులు కేంద్ర ప్రభుత్వ అధికారులు, పదవీలో ఉన్న వారు మాత్రమే కాక మాజీ కేంద్రమంత్రులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, పదవీ విరమణ గావించిన కేంద్ర ప్రభుత్వ అధికారులపై వచ్చే ఆరోపణలను కూడా లోక్‌పాల్ విచారించవచ్చు. వీరిపై వచ్చే ఆరోపణలను లోక్‌పాల్ పరిశీలించి అవసరమయితే సీ.బీ.ఐ. తో సహా వివిధ సంస్థలతో దర్యాప్తుకు ఆదేశించవచ్చు. ఆ తరువాత ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించవచ్చు. లోక్‌పాల్ అప్పగించిన కేసును దర్యాప్తు చేస్తున్న అధికారిని దాని అనుమతి లేకుండా బదిలీ చేయరాదు. అంతర్జాతీయ సంబంధాలతో ముడిపడి ఉండే అంశాల్లోను, విదేశాంగ, అంతరంగిక భద్రత, సాయుధ బలగాల అంశాలు లోక్‌పాల్ పరిధిలోకి రావు. పార్లమెంట్‌లో లేదా సభా సంఘాలలో ప్రస్తావనకు వచ్చే అంశాల ఆధారంగా చేసే ఆరోపణల్లో లోక్‌పాల్ వ్యవస్థ జోక్యం చేసుకోదు.

**సుప్రీంకోర్టు జోక్యంతో ఏర్పడ్డ లోక్‌పాల్ వ్యవస్థ :**

2014 జనవరిలో లోక్‌పాల్ చట్టం అమలులోనికి వచ్చినా ఆ వ్యవస్థ ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగింది. లోక్‌పాల్ నియామకంలో జాప్యంపై సుప్రీంకోర్టు తన ఆగ్రహాన్ని వ్యక్తపరిచింది. లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశం ఎప్పుడు జరుగుతుందో పది రోజుల్లోగా తెలియజేయాలని మార్చి 7వ తేదీన అటార్నీ జనరల్ కే.కే.వేణుగోపాల్‌ను ఆదేశించింది. అంతకు ముందు లోక్‌పాల్‌ను, సభ్యులను ఫిబ్రవరి నెలాకరులోగా ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు జనవరి 17న గడువు విధించింది. దీంతో లోక్‌పాల్ ఎంపిక కమిటీ ఈ నెల 15న సమావేశమై లోక్‌పాల్ ఛైర్‌పర్సన్‌ను, సభ్యులను ఎంపిక చేసింది. లోక్‌పాల్ ఎంపిక కమిటీలో ప్రధాని నరేంద్రమోడీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగొయ్, సీనియర్ న్యాయమూర్తి ముకుల్ రొహత్గీ, లోక్‌సభ స్పీకర్ సభ్యులు. లోక్‌పాల్ చట్టాన్ని అనుసరించి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు కూడా ఈ ఎంపిక కమిటీలో సభ్యుడు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు కూడా సభ్యుడవుతాడు. అయితే ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష హోదా ఏ పార్టీకీ లేనందున ఆ సభ్యుడికి స్థానం లేదు.

**తొలి లోక్‌పాల్ వ్యవస్థ :**

తొలి లోక్‌పాల్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీనాకిచంద్ర ఘోష్ (66) నియమితులయ్యారు. లోక్‌పాల్ వ్యవస్థలో మహిళా జడ్జితో సహా నలుగురు మాజీ హైకోర్టు న్యాయమూర్తులున్నారు. వీరు న్యాయమూర్తులు దిలీప్‌భొసలే, ప్రదీప్‌కుమార్ మహంతి, అభిలాషకుమారి, అజయ్‌కుమార్ త్రిపాఠి. ఈ నలుగురు జ్యూడీషియల్ సభ్యులు. వీరు కాక నలుగురు నాన్ జ్యుడీషియల్ సభ్యులున్నారు. వీరు సహస్త్రసీ మాబల్ డీ.జీ.పి. అర్చనా రామసుందరం, మహారాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డి.కె.జైన్, మహేంద్రసింగ్, ఇంద్రజిత్ ప్రసాద్. లోక్‌పాల్ వ్యవస్థ సభ్యుల నియామకంతో ఈ ప్రక్రియ ముగియలేదు. తనకు వచ్చే ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపడానికి డైరెక్టర్ ఆధ్వర్యంలో విచారణావిభాగాన్ని ఏర్పాటు చేయాలి. ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవడానికి ప్రాసిక్యూషన్ డైరెక్టర్ అవసరం. ఈ రెండు విభాగాలలో పనిచేయడానికి అవసరమయిన సిబ్బందిని నియమించాలి. ఇందుకు కొంత సమయం పట్టొచ్చు. లోక్‌పాల్ ఫిర్యాదు స్వీకరించిన 90 రోజుల్లో ప్రాథమిక విచారణ పూర్తిచేయాలి. ఆ నివేదిక వచ్చిన తరువాత తగిన సంస్థతో దర్యాప్తు జరిపించాలి. ఆరోపణలు నిరాధారమయినవని తెలిస్తే కేసును ముగించవచ్చు.

మనదేశంలో లోక్‌పాల్ అవసరాన్ని గుర్తించి అందుకోసం ఉద్యమించి 50 సంవత్సరాలవుతుంది. ఈ ఉద్యమ ఫలితంగా ఉన్నత స్థానాల్లో అవినీతిని నిర్మూలించడానికి లోక్‌పాల్ వంటి వ్యవస్థ ఏర్పాటు కావడం హర్షదాయకం.

**డా॥ పి.మోహన్‌రావు,**
**అడ్వకేట్ ప్రొఫెసర్, రైల్వే డిగ్రీ కాలేజ్**




# పండ్లను కృత్రిమంగా మాగాబెట్టడానికి వినియోగించే క్యాలిషియం కార్బైడ్ వల్ల కలిగే నష్టాలు మరియు వాటికి ప్రత్యామ్నాయాలు

మామిడి, అరటి, బొప్పాయి, సపోటా, ద్రాక్ష, దానిమ్మ ఇలా అనేక రకాల పండ్లు కాలానికి అనుగుణంగా ఆరగిస్తే మంచిది, ఇవి శరీర ఎదుగుదలకు, పరిపుష్టికి దోహదపడతాయి. మనకు అన్ని కాలాలో దొరికే పండు అరటి పండు, వేసవి కాలంలో మాత్రమే దొరికే పండు మామిడి పండు, అయితే పండ్ల వ్యాపారులు లాబార్జనకు చెట్టుమీద కాయలు పండకుండానే కోసి మాగ బెడుతున్నారు. పచ్చి కాయలను తొందరగా పండించడంకోసం వ్యాపారులు క్యాలిషియం కార్బైడ్ లేదా పోగాబెట్టడం చేస్తున్నారు, అనంతరం బహిరంగ మార్కెట్లో వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మాములుగా సహజసిద్ధంగా పండిన కాయలలో ఫ్రక్టోస్, గ్లూకోస్, కొవ్వు, ప్రోటీన్ లు అధికంగా ఉంటాయి, ఇవి శరీరం నీరశించినప్పుడు తిరిగి ఉత్తేజం కలిగిస్తాయి మరియు మలబద్దకం, ఆహారం జీర్ణం అవ్వడానికి తోడ్పడతాయి, కాని కృత్రిమంగా మాగ బెట్టిన పండ్లలో వీటి శాతం చాలా తక్కువగా లేదా అసలు ఉండవు కనుక కృత్రిమంగా పండించిన కాయలు ఆరోగ్యానికి దోహదపడవు.

మంచిగా చెట్టుకు పండిన మామిడిపల్లను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఆర్థికంగా పెట్టుబడి ఎక్కువ పెట్టవలసి వస్తుంది ఇంకా వారికి మార్కెట్లో లాభాలు తక్కువ లభిస్తాయి అందువల్ల వ్యాపారులు కాయలను ఎంచుకుంటున్నారు. మామిడి తోటలలో గాలి దుమారంకి కిందపడిన మామిడి కాయలను తక్కువ ధరకు కొనుగోలుచేసి వాటిని గోదాములకు తరలిస్తారు. ఇలా గోదాముల్లో నిలువ ఉంచిన మామిడి కాయలను పోట్లాల్లో నింపిన క్యాలిషియం కార్బైడ్ తో మాగబెడతారు, సాధారణంగా ఈ క్యాలిషియం కార్బైడ్‌ను గ్యాస్



వెల్డింగ్ లో ఉపయోగిస్తారు. 20 కిలోల మామిడికాయలను నేల పైన రాసులుగా పోసి కాయలమధ్య 5 నుండి 50 వరకు క్యాలిషియంకార్బైడ్ పొట్లాలను కాయల మధ్య మధ్యల్లో పెడతారు, ఆ క్యాలిషియం కార్బైడ్ గుళికలు పౌడర్ గా మారి వేడిని పుట్టిస్తుంది, ఇలా ఉష్ణోగ్రతలు పెరిగి కాయలు పండ్లుగా మారుతాయి. ఇలా చేయడం వలన నాలుగు రోజుల్లో కాయలు పండ్లుగా మారుతాయి, ఇలా తయారు అయిన మామిడి పండ్లను రిటైల్‌గా అమ్మకందారులు విక్రయిస్తారు. ఇలా చేతులు మారిన మామిడి పండ్లు, మామిడి పండ్ల ప్రియుల చేతులలోకి వెళ్లి అనారోగ్యాన్ని కలుగచేస్తాయి. బహిరంగ మార్కెట్లలో క్యాలిషియం కార్బైడ్ విచ్చలవిడిగా మరియు తక్కువ ధరకే దొరుకుతుంది, కిలో క్యాలిషియంకార్బైడ్ విలువ కేవలం రూ. 80 మాత్రమే ఉంటుంది. క్యాలిషియంకార్బైడ్ వాడకం ప్రభుత్వం నిషేదించినా అది అమలు కావడం లేదు. క్యాలిషియం కార్బైడ్ వంటి రసాయనాలు వినియోగించి ఒక్కరోజులోనే కాయల రంగు, రుచి మార్చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతిచేసే పండ్లను బాక్సుల్లో అమర్చి వాటి మధ్యలో క్యాలిషియం కార్బైడ్ ను ప్యాకెట్ల రూపంలో ఉంచుతున్నారు, దీనితో అవి నిర్దేశిత ప్రాంతానికి చేరుకునేలోగా కాయలు పండిపోతున్నాయి. ఇలా అన్ని దశల్లో క్యాలిషియం కార్బైడ్‌ని వినియోగిస్తుండటంతో పండ్లు సహజ గుణం కోల్పోయి విషతుల్యం అవుతున్నాయి. వారం రోజుల్లో మాగ వలసిన కాయలను ఒకటి రెండు రోజులలో క్యాలిషియం కార్బైడ్ సహాయంతో పసుపు రంగుకు మార్చుతున్నారు, క్యాలిషియం కార్బైడ్ మనం తినే ఎటువంటి పదార్థాల్లో ఇది ఉన్నా గ్యాస్ట్రిక్, ఎలర్జీ, సమస్యలతో పాటు కంటిచూపు కూడా దెబ్బ తింటుంది. ఇంకా నాడి వ్యవస్థ పనితీరుపైన కూడా ఇది ప్రభావం చూపుతుంది.అంతేకాకుండా సహజసిద్దంగా పండిన కాయలలో ఉండే పోషకాలు ఇందులో ఉండవు కనుక ఇలా మాగ బెట్టిన పండ్లు తినడం ఆరోగ్యానికి హానికరం. క్యాలిషియం కార్బైడ్‌తో మాగాబెట్టిన పండ్లు తింటే గర్భిణులకు ప్రమాదకరం, ఒక్కోసారి గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంది అంతే కాకుండా పుట్టే పిల్లలు అంగవైకల్యంతో పుట్టే ప్రమాదము ఉంది.

- క్యాలిషియం కార్బైడ్ వాడకం వలన పరిపక్వతకురాని కాయలను ముందుగ కోయడంవలన, కాయ నాణ్యత సరిగ్గా లేకపోవడమే కాకుండా తీయదనం కూడా తగ్గుతుంది అయినప్పటికీ కాయలు బంగారు పసుపు రంగుతో చూపరులను ఆకట్టుకుంటాయి




- కాయ నాణ్యత లేకపోవడమే కాకుండా క్యాలిషియం కార్బైడ్ గాలిలో కలిసినప్పుడు వెలువడే ఎసిటలిన్, ఫోసిన్, ఆర్సిన్ కలిగి ఉండటంవల్ల వీటితో మాగ బెట్టిన కాయలను తిన్నవారికి అల్సర్లు, కాన్సర్, కాలేయ మరియు మూత్రపిండ సంబందిత వ్యాదులు వచ్చే అవకాశం ఉంది. ఎసిటలిన్ వాయువు కేంద్ర నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపడం వలన తల భారం, దీర్ఘకాలిక మత్తు, జ్ఞాపకశక్తి కోల్పోయే అవకాశం ఉంది
- రసాయనాలతో మాగ బెట్టినప్పుడు పండ్లు యొక్క తోక్కలపై ఈ కెమికల్స్ యొక్క ప్రభావం ఉంటుంది, తోక్కలలోనే రసాయనాలు అధికంగా ఉంటాయి అందువలన పండ్లను ఉప్పునీటితో కడిగి పైన తొక్క తీసేసి తింటే కొంత వరకు మేలు అని వైద్యులు చెప్తున్నారు
- ప్రస్తుతం మామిడి కాయలను క్యాలిషియం కార్బైడ్‌తో మాగబెట్టవద్దు అని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విదించాయి(జి.ఓ.ఆర్.టి. నెం. 288 తేదీ:




19.03.2012)

- ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ రూల్స్ 1995 రూల్ నెం. 44(ఎఎ) ప్రకారం క్యాలిషియం కార్బైడ్ తో పండ్లను మాగ బెట్టడం కూడా నిషేదితం అయినది దీనిని అతిక్రమించిన వారికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 5 లక్షల జరిమానా విధించబడుతుంది

**శాస్త్రీయపద్దతుల్లో పండ్లను మాగబెట్టే పద్ధతి**

మామిడి పండ్లను చెట్టుపైనే బాగా ముదిరిన తరువాత కోయాలి, అలా కోసిన పండ్ల పైన వరి గడ్డి వేయాలి ఇలా వారం రోజుల పాటు ఉంచడం వల్ల పండ్లు మధురమైన రుచిని, వాసనను మరియు పోషక విలువలను సంతరించుకొని సంపూర్ణంగా తినడానికి అనుగుణంగా ఆరోగ్యకరంగా ఉంటాయి. గతంలో మామిడి పండ్లను ఇలానే పండించి విక్రయించే వారు

**మామిడి కాయలను మాగబెట్టడానికి ప్రత్యామ్నాయాలు**

**1) ఇథిలీన్ వాయువుతో పండ్లను మాగబెట్టడం**

ఇథిలీన్ వాయువును ఉపయోగించి పండ్లను మాగబెట్ట డానికి ముఖ్యంగా మామిడి, అరటి, సపోటా కాయలు పక్వానికి (3 వంతులు తయారైన) వచ్చి ఉండాలి. ఇథిలీన్ వాయువును ఉపయోగించడానికి ఇథిలీన్ రైపెనింగ్ చాంబర్స్ ఏర్పాటు, వాణిజ్యపరంగా ఇథరాల్ ద్రావణ లభ్యత గురించి రైతులకు వ్యాపారస్తులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిపించాలి. ముఖ్యంగా మామిడి కాయలను మూడు విదానాల ద్వారా ఇథిలీన్ ను ఉపయోగించి మాగ బెట్టవచ్చు. వాణిజ్యపరంగా ఎక్కువ మోతాదులో కాయలు మాగ బెట్టడానికి అనువైన పద్ధతి. మామిడి కాయలు రైపెనింగ్ చాంబర్లో ఉంచి 100-150 పి.పి.మ్ ఇథిలీన్ వాయువును ప్రవేశపెట్టి, 12-24 గంటలు ఛాంబర్ తలుపులు తెరవకుండా ఉంచాలి. తరువాత కాయలు 4-5 రోజులలో మంచి రంగు సంతరించుకొని పక్వానికి వస్తాయి.

**2) ఇథరల్ ద్రావనంతో మాగ బెట్టె పద్ధతి**

5లీటర్ల నీటిలో 10 మీ.లీ ఇథరల్ రసాయనాన్ని పోసి తయారుగా ఉన్న ద్రావణంలో మామిడి కాయలను 3-5 నిముషాలు ఉంచితే మామిడికాయలు 4-5 రోజులలో పక్వానికి వస్తాయి.

**3) ఇథరల్ ద్రావనాన్ని వాయువుగా మార్చి మాగ బెట్టే పద్ధతి**

5 లీటర్ల నీటిలో 10 మీ. లీ ఇథరల్ రసాయనం, 2 గ్రా. సోడియం హైడ్రోక్సిడ్ ను వేసి ద్రావనాన్ని తయారు చేయాలి, గాలి చొరబడని పాలిథీన్ రైపెనింగ్ చాంబర్లో (1.20 మీ ఐ 1.5మీ ఐ 1.2మీ) మామిడికాయలతో బాటు ద్రావణాన్ని ఉంచి, 12-24 గంటలు మూసి ఉంచితే, ద్రావనం నుండి ఇథిలీన్ వాయువులు వెలువడి మామిడి కాయలు 4-5 రోజులలో పక్వానికి వస్తాయి. ఈ మూడు విదానాలను పరిశోధనా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించి నందున పైన పేర్కున్న ఏ పద్ధతి ద్వారా నైన మామిడికాయలను మాగబెట్టవచ్చు

**ఇథిలీన్ ద్వారా మాగబెట్టడం**

- చట్టప్రకారం ప్రపంచ ఆరోగ్యసంస్థ ద్వారా గుర్తింపు మరియు అనుమతి పొందింది
- ఇది ఆరోగ్యపరంగా పూర్తిగా సహజసిద్ధమైనది, సురక్షితం
- రుచి పూర్తిగా తీయ్యగా మరియు ఆహ్లాదంగా ఉంటుంది
- కాయలు ఎక్కువ కాలం నిలువ ఉంటాయి
- బరువు నష్టం 7-10 శతం మాత్రమే ఉంటుంది
- గిరాకిపైన రోజు రోజుకి అవగాహన పెరుగుతుంది
- మాగ బెట్టడానికి అయ్యే కర్చు చాలా తక్కువ
- రవాణా నష్టం చాల తక్కువ

**యలవర్తి నాగరాజు,** పిహెచ్.డి స్కాలర్,
యూనివర్సిటి ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, రాయచూర్



# నీటి సంరక్షణపై ప్రజలకూ అవగాహన

తాగు, సాగు నీటి అవసరాలకు భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. దేశవ్యాప్తంగా మన రాష్ట్రంలో భూగర్భ జల మట్టం సంవత్సరానికి మీటర్ వంతున పడిపోతుందన్న గణాంకాలు ఆందోళనను కలగ చేయడమే కాక మన కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాయి. భవిష్యత్తులో పెరగబోతున్న జనాభా, పట్టణాలకు, నగరాలకు భారీగా పెరుగుతున్న వలసలు, వ్యవసాయానికి తగ్గిపోతున్న నీటి లభ్యతను గమనిస్తే రానున్న రోజుల్లో తలసరి నీటి లభ్యత పైన విపరీతమైన ఒత్తిడి పడబోతున్నది. దీని ప్రభావం ఆహార ఉత్పత్తి, ఆహార భద్రత పైన తప్పక పడుతుంది. నీరు, చెట్లు, పర్యావరణం పరిరక్షణ లక్ష్యంగా 2002వ సంవత్సరంలో అమలులోకి వచ్చిన వాల్టా చట్టం అధికారుల అలసత్వం కారణంగా మరుగున పడిపోయింది. రాష్ట్రంలో కుంటలు, చెరువులు, హుస్సేన్సాగర్ వంటి భారీ మంచి నీటి జలాశయాలు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగ మిగిలిపోయాయి. పారిశ్రామిక వ్యర్థాలు, పంటలకు వాడే రసాయనాలు, అడ్డూ అదుపు లేని ఇసుక, మట్టి తవ్వకాలు, పారిశుధ్యం పట్ల అవగాహన లేకపోవడం వంటి వాటివల్ల భూగర్భ జలాలు కాలుష్యానికి గురవుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా నీటి కొరత ఎదుర్కుంటున్న పెద్ద నగరాల జాబితాలో హైదరాబాద్ 20వ స్థానంలో ఉన్నది. హైదరాబాద్ నగరంలో రెండు దశాబ్దాల క్రితం అనేక ప్రాంతాలలో 50 అడుగులకే భూమిలో స్వచ్ఛమైన నీరు లభించేది. నేడు చాలా ప్రాంతాలలో 1500 అడుగుల కంటే తక్కువ లోతులో నీరు లభించని దుస్థితి నెలకొన్నది. అనేక ప్రాంతాలలో భూగర్భ జలాలు పూర్తి గా ఎండిపోయాయి. రోజూ నీటి ట్యాంకర్ వస్తే గానీ గడవని పరిస్థితి నెలకొన్నది. పటాన్చెరు, ఐడీఏ బొల్లారం, జీడిమెట్ల వంటి పారిశ్రామిక వాడలలో భూగర్భ నీరు వినియోగ యోగ్యం కానంత కలుషితమైపోయింది. ఒక బోరు బావి ఎండి పోగానే మరింత లోతుకు మరొక బోరు బావిని తవ్వడమే పరిష్కారంగా చూస్తున్నారు తప్ప, నీటిని





సంరక్షించడం, నీటిని పొదుపు చేయడం వంటి విషయాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీనివలన భవిష్యత్తులో భూగర్భ పొరలలో విపరీతమైన మార్పులు చోటు చేసుకోవడంతో పాటు నీటి లభ్యత పూర్తిగా మృగ్యం అవుతుంది.

ఎడారి దేశమైన ఇజ్రాయెల్తో పాటు సింగపూర్ 100 శాతం వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించు కొంటుండగా, అత్యల్ప వర్షపాతం నమోదయ్యే సౌతాఫ్రికా దేశం కూడా చెప్పుకోదగ్గ ప్రగతిని సాధించింది. మన దేశంలో కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలు వాన నీటిని సంరక్షించడంలో, సక్రమంగా వినియోగించుకోవడంలో ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా బెంగళూరు, చెన్నై నగరాలలో మున్సిపల్ కార్పొరేషన్ వారు చేపట్టిన ఇంటింటికీ ఇంకుడు గుంటలు కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ, సంరక్షణ కార్యక్రమం చేపడుతున్నది. అయితే ప్రజలు కూడా తమవంతు కర్తవ్యంగా నీటి సంరక్షణకు నడుం బిగించాలి. ముఖ్యంగా కురిసే ప్రతి వాన నీటి బొట్టుని ఒడిసి పట్టుకోవాలి. హైదరాబాద్లో అధిక సంఖ్యలోని అపార్ట్మెంటు వాసులు పై కప్పు పై పడ్డ వర్షపు నీటిని వృథాగా రోడ్లపై వదిలేస్తున్నారు, దీనితో చిన్నపాటి వర్షానికే రోడ్లన్ని చెరువులను తలపిస్తున్నాయి. 100 చదరపు మీటర్లపై కప్పు వైశాల్యంపై కురిసే సరాసరి వర్షపాతాన్ని సంరక్షిస్తే నలుగురితో కూడిన కుటుంబానికి 100 రోజుల నీటి అవసరాలు తీరతాయి.

వాన నీటి సంరక్షణను ప్రజలు తమ కర్తవ్యంగా భావించాలి. భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంటలను ఇంటింటా, వాడవాడలా ఏర్పాటు చేసుకోవాలి. నీటి ని పొదుపుగా వాడటం అలవర్చుకోవాలి. చెట్ల పెంపకం విరివిగా చేపట్టాలి. ప్రతి ఇల్లు, అపార్ట్మెంట్ కాలనీలలో, స్కూల్, కాలేజీలు, విశ్వ విద్యాలయాలు, ప్రభు త్వ, ప్రైవేటు ఆసుపత్రులు, కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్సు, ఫ్యాక్టరీలు వంటి వాటిలో విధిగా వాన నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి. కాలనీలలో వాననీటి సంరక్షణ కోసం బృందాలుగా ఏర్పడి ఆరు బయట పడ్డ వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా ఏర్పాట్లు చేయాలి.

రైతులు వ్యవసాయంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్, గ్రీన్హౌస్ వంటి ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా నీటి వాడకాన్ని, ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. తమ పొలాలలో ఇంకుడు గుంతలు, చిన్న పాటి చెరువులు నిర్మించు కోవాలి, వాలుకు అడ్డంగా కాంటూర్ కందకాలు తవ్వి నీటిని భూమిలోకి ఇంకింప చేసుకోవాలి. నీటి ప్రవాహం ఎక్కువ ఉండే వాలు ప్రాంతాల్లో వాటర్ షెడ్లను ఏర్పాటు చేసుకుని నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా వ్యవసాయ అవసరాలకు వాడుకోవచ్చు. అత్యల్ప వర్షపాతం ఉండే ఇజ్రాయెల్ దేశం నీటి వినియోగం, వ్యవసాయ సాంకేతికతలో ప్రపంచానికే ఆదర్శంగా ఉంది. ఇజ్రాయెల్లో వ్యవసాయం కోసం నీటిని, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ అత్యధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఒక ఎకరంలో దాదాపు 200 టన్నుల టమాటాను పండిస్తున్నారంటే ఎంత ప్రగతి సాధించారో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వం ప్రతి కట్టడంలో వాన నీటి సంరక్షణను ఏర్పాటు చేయాలన్న నిబంధనను తప్పనిసరి చేయాలి.

ఇప్పుడు భవనం పైకప్పు పైన పడ్డ వర్షాన్ని ఫిల్టర్ చేసి నేరుగా బోరు బావిలోకి పంపేందుకు ఫిల్టర్లు అందుబాటులోకి వచ్చాయి, వీటితో వర్షపు నీటిని నేరుగా బోరు బావిలోకి పంపి భూగర్భ జలాలను పెంపొందించవచ్చు. ఇందువలన పూర్తిగా ఎండిపోయిన బోరు బావులు సైతం తిరిగి జల కళను సంతరించుకుంటాయి. ప్రభుత్వం ఈ పరికరాలను పన్ను నుంచి మినహాయించాలి. ప్రజలకు వాన నీటి సంరక్షణపై అవగాహన కోసం బెంగళూరులో జల మండలి వారు ఏర్పాటు చేసిన విధంగా వాన నీటి సంరక్షణ మోడల్ పార్కుని ఏర్పాటు చేయాలి. కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పద్దు కింద వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు విరాళాలు ఇచ్చే విధంగా తగు మార్గ దర్శకాలు రూపొందించాలి. వాన నీటి సంరక్షణ కు ఇంటింటికీ ప్రచారం, అవగాహన సదస్సులు, ప్రోత్సాహకాలు, బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వడం వంటివి చేయాలి. మొక్కలను విరివిగా పెంచి, ఉన్న వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా స్కూళ్ళు, కాలేజీ లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

-టి.త్రినాథ్



# తిమ్మయ్య పల్లి - నీటి సంరక్షణలో ముందంజ

రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు 200 కి.మీ దూరంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి 50 కి.మీ. దూరంలో ఉన్నటువంటి గ్రామము తిమ్మయ్య పల్లి మండలం అడ్డాకుల. ఇది పూర్తిగా షెడ్యూల్డ్ కులాల వారు నివసించు గ్రామము. ఇక్కడ 400 కుటుంబాలు నివసిస్తుంటాయి. ఇక్కడి జనాభా 2000.

ఈ గ్రామము కరువుతో సతమతమయ్యేది. ఈ గ్రామంలో త్రాగునీటికి మరియు సాగు నీటికి చాలా కష్టాలు ఎదుర్కొంటుండేది. ఈ గ్రామ ప్రజలు వారి నీటి అవసరాలకు ఒక చెరువు పైన ఆధారపడేవారు. 2014 సం॥లో లచ్చునాయక్ ఆధ్వర్యంలో నీటి కష్టాలు అధిగమించేందుకు ఒక కార్యాచరణ రూపొందించుకున్నారు. దీనిలో భాగంగా లచ్చునాయక్ తన 2 ఎకరాల భూమిని నీటి కుంటను నిర్మించడానికి దానము చేసినాడు. అతని అడుగుజాడల్లో ఇతర గ్రామస్తులు కూడ భూమి దానం చేసినారు.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో రూ.14 లక్షలు ఖర్చు చేసి నాలుగు నీటి కుంటలు తవ్వినారు. వాటికి లచ్చునాయక్ కుంట, కిషన్ నాయక్ కుంట, మునికుంట మరియు రాయుడు కుంటగా నామకరణం చేసినారు. ఈ కుంటలలో నిలువ చేసిన నీటిని గ్రామస్తులు తమ త్రాగు మరియు సాటినీటికి ఉపయోగించుకుంటున్నారు. ఈ గ్రామము జాతీయ స్థాయిలో నీటి సంరక్షణలో పేరు సంపాదించుకుంది. గౌ॥ ప్రధానమంత్రి గారు తన 'మన్ కీ బాత్' కార్యక్రమములో ఈ గ్రామ విశిష్టత గురించి చెప్పడం జరిగింది. సర్పంచ్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అందరు ఏకతాటిపై వచ్చి నీటి యొక్క విలువ తెలుసుకుని దాని సంరక్షణకు పూనుకోవడం అభినందనీయం.



# నిర్దిష్టమైన లక్ష్యంతో కొత్త బంగారు లోకం

జీవితం కొత్తగా ఉండాలని, కొత్త మార్పు రావాలని, భవిష్యత్తు బంగారుమాయం కావాలని, సంతోషం సొంతమవ్వాలని, హాయిగా, జాలిగా, జల్సాగా గడపాలని, సమస్యలు దరిచేరకూడదని, ఆటుపోట్లను అధిగమించాలని, సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించాలని, ఆశించడం సహజమే ఇలా.. చెప్పుకుంటూ పోతే ఆశలకు అంతే ఉండదు. వీటి వెనుక ఉన్న అసలు నిజం కొత్త బంగారు లోకం చేరువ కావాలన్న ఆకాంక్ష.

కొత్త బంగారు లోకం కోరుకోగానే కల్లముందు సాక్షాత్కరించదు. ఆకాశం నుండి ఊడిపడేది కాదు. స్వతహాగా సాధించాల్సిందే..ప్రయత్నించి అందుకోవాల్సిందే. ఈ లోకానికి చేరువవ్వాలంటే దిగువ అంశాలు పాటించాలి.

**లక్ష్యం...**

కొత్త బంగారు లోకం చేరువ అవ్వాలంటే ముందుగా మీకంటూ నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. చాలామంది తామెందుకు చదువుతున్నామో,ఏమి చేస్తున్నామో, ఎందుకు బ్రతుకుతున్నామో కుడా తెలియనట్టు ఉంటారు. ఇలాంటి వారు ప్రతి నిత్యం క్రాస్ రోడ్డులో ఉన్నట్లు వ్యవహరిస్తారు. మానసిక సంఘర్షణల మధ్య నలిగి పోతుంటారు.

అలా కాకుండా, అది కూడా తమ ఇష్టాలు,శక్తి సామర్థ్యాలకు సరిపోయే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. ఈ లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలి. ఈ ప్రయాణంలో ఒకటి, రెండు ఎదురుదెబ్బలు తగిలినా నిరాశ చెందకుండా వాటినే విజయ సోపానాలుగా మలుచుకుని,అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి. లక్ష్యాన్ని సాధించినప్పుడు జీవితమంతా కొత్త బంగారు లోకమే అవుతుంది.

**మానవ సంబందాలు ...**

మీరు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా, సంపాదన ఎంత ఉన్నా, మనిషికి సంతృప్తి కుటుంబం, మిత్రుల ద్వారానే ఎక్కువగా లభిస్తుంది. మానసిక ధైర్యాన్నిచ్చి అండగా నిలిచేది కుటుంబ సభ్యులు, మిత్రులే. మంచి మానవ సంభందాలే మానసిక శక్తిని రెట్టింపు చేస్తాయి. మంచి మానవ సంభంధాలు కలిగి ఉన్నవారికి ఎల్లప్పుడూ "కొత్త బంగారు లోకం" వెన్నంటే ఉంటుంది.

**ఆశావాదం...**

మనసు బాగుంటే మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. ఆశావాదం గలవారే మనసులో ఎలాంటి ఆందోళనలు లేకుండా నిత్య నూతనంగా ఉండగలుగుతారు. ఆశావాద దృక్పథంతో




సమస్యలను ఎదుర్కోవచ్చని, సమస్య తాత్కాలికమేనని గ్రహించి, అధైర్య పడకుండా సమస్యలను ఎదురుకోవడానికి సిద్ధంగా ఉండాలి. మీలో అస్థిరత్వం స్థిరంగా తిష్టవేసుకుని కూర్చున్నా, దానివల్ల మీ ఆశావాద దృక్పథంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోకుడదు. ఆశావాద దృక్పథం కలవారికి జీవితం ఎప్పుడు కొత్త బంగారు లోకమే.

**మార్పు...**

ప్రపంచంలో మార్పు సహజం. అన్ని రొజులూ ఒకే విధంగా ఉండవు. నేడు విద్యార్థులు గొప్పదనుకున్న కోర్సు రేపటికి పేలవంగా మారవచ్చు. అలాగే నేడు జనాదరణ పొందుతున్న వస్తువు రేపు నిరాదరణకు గురి కావచ్చు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారడం తప్పనిసరి. మార్పుని జీర్ణించుకోలేనివారు జీవితంలో ఉన్నతమైన మెట్లు ఎక్కలేరు. అక్కడే నిలబడిపోతారు. ప్రపంచంలోని మార్పులను త్వరగా ఆకళింపు చేసుకుని వెనువెంటనే వ్యూహాలను మార్చుకున్నవారే తెలివైనవారు. అలాంటివారికి ప్రతి మార్పులోను కొత్త బంగారు లోకమే కనిపిస్తుంది.

**సమయం...**

ప్రకృతి మనకు అందించిన 24 గంటల సమయాన్ని మనమేలాగు మార్చలేం. కాని మనం తలుచుకుంటే ఈ 24 గంటలను నిర్మాణాత్మకంగా, సంతృప్తికరంగా గడపకుండా ఉ ండటానికి ఏ శక్తి అడ్డుకోలేదు. గడుస్తున్న క్షణాలను వాటి విలువ కన్నా ఎక్కువగా మనం వినియోగించుకోవచ్చు.

ఉదయం మేల్కొన్న దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు ఒక పద్ధతి ప్రకారం పనులు చేసుకుంటూ పోతే అనవసర శ్రమను తప్పించిన వారవుతారు. చేసే పనులలో ఇబ్బందులు

ఎదురవకుండా ఉంటాయి. ఒక టైం ప్రకారం చేసుకుంటూపోతే మనం సాధించలేనిదంటూ ఏమి ఉండదు. అనుకున్నది సాధించినప్పుడు మనసంతా కొత్త బంగారుమయమవుతుంది.

**ఉత్సాహం...**

ఎంతటి కష్టసాధ్యమైన కార్యాన్నయినా ప్రారంభించడానికి అవసరమైన మౌలిక శక్తి ఉత్సాహం. ఉత్సాహాన్ని తపన, నమ్మికల మిశ్రమంగా పేర్కొనవచ్చు. మరోమాట చెప్పాలంటే మన పని పట్ల మనం ఉద్వేగం చెంది, ఎలాంటి పరిస్థితినైనా అదుపులోకి తెచ్చుకునే శక్తి నాలో ఉందనే ఆత్మవిశ్వాసాన్ని పొందడమే ఉత్సాహం. ప్రపంచంలో కష్టించి పనిచేసి విజయం పొందనివారు ఎవరూ ఉండరు. ఉత్సాహం నిండిన వ్యక్తి తీసుకునే ప్రతి చర్య కొత్త బంగారు లోకంలో విహరింపజేస్తునే ఉంటుంది.

**ఆలోచన...**

మనిషికి, జంతువులకు మధ్య ఉన్న తేడా ఇదే... మనిషి ఇంత వేగంగా అభివృద్ధి చెందడానికి కారణం ఆలోచనే. మనల్ని కొత్త బంగారు లోకం చేర్చడానికి ఉపయోగపడే లక్షణాలలో ఈ ఆలోచనను మార్చుకుంటే అద్భుతాలు జరుగుతాయి. అసాధ్యమనుకున్నది సుసాధ్యమవుతుంది. చేయాలనుకున్నవి చేయడం అలవాటవుతుంది. ఆలోచనల్లో అతి చిన్న మార్పే నరకాన్ని స్వర్గంగా మారుస్తుంది.

**కోపం...**

కొత్త బంగారు లోకం చేరువ కావాలంటే వదిలించుకోవాల్సిన దుర్గుణం కోపం. మనిషికి కోపం ఒక విధ్వంసకర శక్తి. ఇది మనిషి వ్యక్తిత్వం యొక్క సంతుల్యతని దెబ్బతీస్తుంది. విపరీత పరిణామాలకు దారి తీస్తుంది. కోపం కోటి అనర్థాలకు మూలం. దీనివల్ల మనకు ఒరిగేది తక్కువ. కోల్పోయేది ఎక్కువ. కాబట్టి కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి. కోపం వచ్చినప్పుడు అతిగా స్పందించకుండా...ఆ కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి.

**చిరునవ్వు...**

జీవితంలో ఏదో పోగొట్టుకున్న వారిలా ఎవ్వరికి లేని కష్టాలు తమకే వున్నట్లు, తామే అనుభవిస్తున్నట్లు ముఖంపై నవ్వనేది కనబడకుండా గడిపే వారికి కొత్త బంగారు లోకం ఎప్పుడూ దూరంగానే ఉంటుంది. నవ్వు మనలో తెలియని ఒక శక్తిని సృష్టిస్తుంది. ఉత్తేజాన్ని కలిగిస్తుంది. సాధ్యమైనంత వరకు నవ్వుతూ, నవ్విస్తూ ఉండండి. నవ్వు మీకు శక్తినిచ్చే ఒక టానిక్‌లా ఉపయోగపడుతుంది.

**ప్రేమించాలి...**

ప్రేమించడం నేర్చుకుంటే ఎక్కడున్నా, ఏ వాతావరణం లోనైనా సులభంగా ఇమిడి పోతారు. కుటుంబాన్ని, స్నేహితులను, నిర్వహిస్తున్న ఉద్యోగాన్ని, చదువుతున్న కోర్సును, కాలేజిని, నివసిస్తున్న ప్రాంతాన్ని అన్నింటిని ప్రేమించగలగాలి. ప్రేమించడం అలవాటుగా మారితే ఎలాంటి శారీరక, మానసిక రుగ్మతలు దరిచేరవు. ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తుంది.

**సంతృప్తి...**

సంతృప్తి కలిగి ఉన్న వారిలో ఆందోళన, ఈర్ష్య ద్వేషాలు ఏమాత్రం ఉండవు. సంతృప్తి కలిగి ఉన్నవారి వెంటే సంతోషం వుంటుంది. సంతోషమే సగం బలం అన్నారు. సంతృప్తి వున్నవాళ్ళు ప్రతి నిమిషాన్ని కొత్త ఉత్సాహంతో ఎంజాయ్ చేస్తారు. ప్రతి క్షణంలో కొత్త అనుభూతిని ఆస్వాదిస్తారు.

**సృజనాత్మకత...**

సృజనాత్మకత అంటే ఓ కొత్త లేదా అసలు మూలానికి ఓ రుపాన్నివ్వడం, ఓ సమస్యకు పరిష్కారం సరికొత్త మార్గంలో అన్వేషించడం. ఎవరైతే కొత్తకు స్వాగతం పలకటం కోసం తనను తాను వినూత్నంగా మలుచుకుంటాడో అతను పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవిస్తాడు. ఏదైనా సాధించాలను కున్నప్పుడు కొత్తది అంతకుముందు ఎవరూ సాధించలేనిది సాధించాలి. అందులో ఓ కొత్తదనాన్ని అందరికి చూపించ గలగాలి. అప్పుడే అది అపురూపంగా మారి సృజనాత్మకంగా గుర్తింపు తెచ్చుకుంటుంది. అందరి మన్ననలు అందు కుంటుంది. కొత్త బంగారు లోకాన్ని అందిస్తుంది.

**రిలాక్స్...**

రోజు చేసే పనే, రోజు చేసే ఉద్యోగమే... ఇలా యాంత్రిక జీవనం గడుపుతూ ఉంటే... రోజు వారీ జీవితం ఒకేలా సాగిపోతూ ఉంటే నిస్సారంగా అనిపిస్తుంది. పనిమీద ఉత్సాహం, ఆసక్తి సన్నగిల్లుతాయి. మదిలో అసంతృప్త, చిరాకు ఏర్పడతాయి. కొత్తగా, వెరైటీగా గడపాలని మనసు ఆరాటపడుతుంది. ఇలాంటప్పుడే దైనందిన కార్యకలాపాలకు భిన్నంగా వెళ్ళాలి. రిలాక్స్ అవ్వాలి. నచ్చింది చేయాలి. నచ్చినట్లు గడపాలి. మనం కష్టపడుతున్నది మనం బ్రతకడానికే. అలా బ్రతకాలంటే మనిషికి తప్పకుండా రిలాక్సేషన్ చాలా అవసరం.

కొత్త బంగారు లోకానికి చేరువ అవ్వాలని కోరుకుంటే సరిపోదు. ఆ దిశగా ప్రయత్నించాలి. పై అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఆ లక్షణాలను పెంపొందించుకోవాలి. ఏ వ్యక్తికీ ప్రయత్నించకుండా ఏమి రావు. ప్రయత్నిస్తున్నప్పుడు కొన్నిసార్లు విఫలం కావచ్చు. అంత మాత్రాన అపకూడదు. కొత్త బంగారు లోకం అందుకోవాలన్న ధృడచిత్తంతో, పట్టుదలతో ప్రయత్నించాలి. అలా ప్రయత్నించే వారికే కొత్త బంగారు లోకం చేరువ అవుతుంది. జీవిత ప్రయాణమంతా ఆనందమయ మవుతుంది.

– **కోరుకంటి మహేందర్ రావు,** కరీంనగర్



# పశుపోషణతో జీవనోపాదం

బతుకు పోరు కోసం చేసే ప్రయత్నంలో, ఆదివాసీ కుటుంబంలో వచ్చిన మార్పు ఇది.

ఇది రెండు మేకల్ని 60 మేకలు చేసిన మాంత్రికుడి కథ. ఇదేదో మాయలు మంత్రాలతో మేకల సంఖ్యని పెంచిన చందమామ కథకాదు.

ఏకలవ్య ఫౌండేషన్ ఆర్థిక సాయంతో రెండు మేకలను పొంది, వాటిని క్రమంగా అరవై మేకలకు పెంచిన శ్రామికుడు కొమర ముత్తా కథ.

ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండలంలో జాలం తాండా, కొలాం గూడా జంట పల్లెలు. సాగునీరు లేక,వర్షాధార పంటల మీద అందరూ ఆధార పడి బతుకుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో అక్కడ నాబార్డు సాయంతో, ఏకలవ్య ఫౌండేషన్ వాటర్‌షెడ్ పథకం అమలు చేసింది. ఫలితంగా ఈ గ్రామాల్లోని బీడు భూములు సాగులోకి వచ్చాయి.

ఈ పథకంలో భాగంగా, భూమిలేని రైతుల జీవనోపాధుల కోసం పశుపోషణకు రుణాలు ఇచ్చారు. అలా సాయం పొందిన కొమర ముత్తా రెండు మేకలను కొన్నాడు. వాటిని రోజూ అడవుల్లోకి తీసుకెళ్లి మేపాడు.



**అక్కడ మేకల్ని పెంచడం సాహసమే...**

రోజూ దట్టమైన అడవుల్లోకి వెళ్లి రావడం జీవన్మరణ పోరాటమే, కవ్వాల్ అభయారణ్యం సమీప అడవులవి. పులులు,తోడేళ్ల నుండి మేకలను కాపాడటం సాహసమే. కొన్ని సార్లు తనను తాను కాపాడు కోవడానికి చెట్లమీద ఉండాల్సి వచ్చేదని ధైర్యం నిండిన కళ్లతో అంటాడు కొమర ముత్తా .

కొన్ని మేకలు అడవి జంతువుల పాలైనా, మిగిలిన వాటిని శ్రద్ధగా పోషించడం వల్ల క్రమంగా అవి అరవై సంఖ్యను దాటాయి. చేతికి అంది వచ్చిన మేకలను అమ్ముకుంటూ అతడు స్వయం సమృద్ధిని సాధించాడు.

**అప్పుల నుండి విముక్తి**

ఇప్పుడా గోండు గిరిజనుడికి ఆర్థిక ఇబ్బందులు లేవు. అప్పులు లేవు. అతడికి మేకలను ఇవ్వడంతోపాటు వాటి ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యతను కూడా ఏకలవ్య ఫౌండేషన్ తీసుకుంది. ప్రతి వారం ఒక పశువైద్యుడు మేకల ఆరోగ్యాన్ని పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు సూచిస్తాడు. మేకలు అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయంతోనే కొమర ముత్తా తన కూతురికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేశాడు. ఇపుడు అల్లుడు, కూతురు కూడా మేకల పెంపకం చేపట్టారు. వీరి ప్రగతిని చూసిన జాలం తాండా రైతులు కొందరు వీరి అడుగు జాడల్లో నడుస్తున్నారు.

**– కె.పూర్ణిమ**



# మహబూబ్‌నగర్ జిల్లా పేరూర్ గ్రామము - ఒక విజయగాథ

మహబూబ్ నగర్ జిల్లా దేవర్ కద్ర మండలం లోని పేరూర్ గ్రామం లో సర్వే చేసిన మొత్తం కుటుంబల సంఖ్య 224, గ్రామంలో మొత్తం జనభా 1975 ఆడవారు 1001 మగవారు 974 గ్రామంలో నివసిస్తున్నారు.

మండల అధికారుల ఆదేశం మేరకు సర్వే చేయడం ద్వారా 224 కుటుంబాలలో మరుగు దొడ్లు వున్న కుటుంబాలు 127 లేనివారు 97 కుటుంబాలు లేనివారు. ఈ 97 కుటుంబాలకు సంబందించిన వివరాలు అనగా ఆధార్ నెంబర్, బ్యాంక్ ఖాతా నెంబర్, ఉపాధి హామీ, కూలీ కార్డ్ నెంబర్ సంబందించి వివరాలు గ్రామ సమైక్య, మండల సమైక్య, అంగన్వాడీ, సాక్షార్ భారత్, ఆశా వర్కర్, బుక్ కీపర్ మరియు విద్య కమీటీ వారితో సేకరించి గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ దృష్టికి తీసుకుపోవడం జరిగింది. పంచాయతీ సెక్రెటరీ ఎంపిసికి ఇవ్వడం జరిగింది. వారం రోజులలో మంజూరు ఇవ్వడం జరిగింది.

పేరూర్ గ్రామం లో గ్రామ సర్పంచ్ అద్యక్షతన గ్రామ సభ పెట్టడం జరిగింది. ఈ గ్రామ సభ సమావేశం లో గ్రామ సర్పంచ్ జె చమాన్, వార్డ్ సబ్యులు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ సభ్యులు, గ్రామ యువజన సంఘం వారూ, గ్రామ అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు మొత్తం 60 మంది హాజరు అయినారు. ఈ సమావేశం లో పంచాయతీ కార్యదర్శి గారు మరుగు దొడ్డి నిర్మించు కొన్నట్ల అయితే కలిగే ఇబ్బందులు అనగా ఆరోగ్య పరంగా మరియు ఇతర ఆటంకాలు చెప్పడం జరిగింది. ముఖ్యంగా వయసు వచ్చిన ఆడ పిల్లలకు మరుగు దొడ్డి కట్టుకోకపోతే వారూ బయటకు వెళ్ళుటకు ఎలా ఇబ్బంది పడతారో చెప్పడం జరిగింది. అలాగే గర్భిణీలు సరైన సమయంలో కాలకృత్యాలు తీసుకోనట్ల అయితే కలిగే ఇబ్బందులు చెప్పడం జరిగింది. అలాగే ఆర్ డబ్లూ ఎస్. పవన్ గారు మాకు జెడ్ పి సమావేశ మందిరం లో ఒక ఈగ తాను చేసే పనులను వీడియో పరంగా చూపించారు. ఈ వీడియో ను గ్రామ సభల్లో చూపించడం జరిగింది. గ్రామ సర్పంచ్ గారు నాణ్యత గల మెటీరియల్ గ్రామ కమిటీ ద్వారా కొనుగోలు చేసి ప్రతి ఇంటికి అందించి తానే కష్టపడడం జరిగింది. ఈ సమావేశంలో గ్రామాన్ని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత గ్రామంగా చేయాలని తీర్మానించడమైనది.



**గ్రామంలో బహిర్భుమి గ్రామ ప్రజలు వెళ్ళే ప్రాంతాలు గుర్తించడం :**

గ్రామ సర్పంచ్ గారు జె చమాన్ గ్రామ ప్రజలు తమ కాలకృత్యాలు వెళ్ళే ప్రాంతాలు గుర్తించినారు అక్కడ ఉన్న కంప చెట్లను తొలగించడం జరిగింది. కావున తప్పని సరిగా ప్రతి కుటుంబానికి మరుగు దొడ్డి కావాలన్న అవగాహన ఏర్పడేటట్టు చేశారు



**గ్రామంలో మరుగుదొడ్డి లేనివారి ఇళ్ళకు వెళ్ళడం:**

గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ఇద్దరు కలిసి యువజన సంఘాలను వారితో కలుపుకొని నేరుగా తానేవెళ్ళి సర్పంచ్ గుంతలను తీయడం జరిగింది. గట్టిగా ఉన్న నేలలు మనుషులు తీయడానికి కష్టంగా ఉన్న సమయంలో జెసిబి మిషన్ లను వాడి గుంతలను తీయడం జరిగింది గ్రామ సర్పంచ్ గారు.

**సమస్యలు మరియు పరిష్కారాలు:**

గ్రామంలో ముసలన్న అనే లబ్దిదారు తన కుమారుడు పెళ్లి సంబంధానికి వెళ్లినప్పుడు ఎదురైన ఇబ్బంది ఏమనగా తన కుమారుని అవతలి వారు మరుగుదొడ్డి గురించి అడగడంతో ముసలన్న పంచాయతీ కార్యదర్శిని వచ్చి కలవడం జరిగింది. అప్పుడు ముసలన్న తన మట్టి ఇల్లు ఉన్న మరుగుదొడ్డి నిర్మించి మంచిగా కట్టు కోవడం జరిగింది.

గ్రామంలో ముగ్గురు లబ్దిదారులు తమకు ఇంటి దగ్గర స్థలాలు లేవని తెలిపి నప్పుడు గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కలిసి వెళ్ళి గ్రామానికి దగ్గరలో ఉన్న ఇంతకు ముందు గ్రామ ప్రజలు బహిర్భుమి వెళ్ళే ప్రాంతంలో ఉన్న స్థలానికి సంబందించిన యజమానితో మాట్లాడి అక్కడ స్తలాన్ని సేకరించి మరుగుదొడ్లు కట్టించడం జరిగింది.

కిష్టంపల్లి ఆవాసంలో లబ్దిదారులు చాలా పేదవారు ఇక్కడ మొదటి 6000/సహాయంతో గుంతలు తీశారు మరియు అందులో రింగులు వేసారు బేస్ మెంట్ వేసారు కానీ ఇంకనూ ఆర్టిక సహాయం అవసరం ఆ సమయంలో వారి అవసరం గ్రామ సర్పంచ్ ఆలోచించి గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడినారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి లబ్దిదారులను బ్యాంక్ దగ్గరకు తీసుకొని వెళ్ళి మిగిలిన 6000/- రూపాయలు డ్రా చేయించి వారికి సంబందించి మెటీరియల్ మొత్తంను అందించడం జరిగింది. మొత్తం మరుగు దొడ్లలో రెండు మరుగుదొడ్లు ఇంకనూ కావలసి ఉన్నవి. వారి ఇండ్లలో వ్యక్తిగత కారణాల వల్ల ఆగిపోయాయి కిష్టంపల్లి ఆవాసంలో మంజూరు అయినవి. 21 పూర్తి అయినవి 19.

**మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడానికి దోహద పడిన అంశాలు:**

గ్రామ సర్పంచ్ జె చమన్ మరియు యువ సంఘం సభ్యులు ఆర్ సి శ్రీనివాసులు, సూర్య నారాయణ, సూర్య ప్రతాప్, ఈ బాలరాజు వీరు అందరూ కలిసి ప్రతి ఇంటికి వెళ్ళి ఆడపిల్లలు బహిర్భూమి వెళ్ళేప్పుడు పడే బాధలు వివరించి చెప్పి లబ్దిదారు ఇంటి దగ్గర స్థలం ఉన్నట్లైతే వారికి మరుగుదొడ్డి కట్టుకునేందుకు అనుమతులు కల్పించడం జరుగుతుంది.

గ్రామానికి సంబందించిన వాట్స్ ఆప్ లో ఒక గ్రూప్ చేయించడం జరిగింది. దానిలో గ్రామ యూత్ మొత్తం ఉన్నారు. దానిలో గ్రామ సర్పంచ్, యువజన సంఘం చేసే మరుగుదొడ్ల పనులను ఎప్పటికప్పుడు తెలపడంతో అందరూ ఉత్తేజంతో యువజన సంఘాలు పాల్గొనడం జరిగింది.

**గ్రామంలో తదుపరి చేపట్టబోవు కార్యక్రమాలు :**

గ్రామంలో వర్షాపాతం తక్కువగా ఉన్నందున్న భూగర్భ నీటి మట్టం పెంచేందుకు మరియు వర్షాలు ఎక్కువగా పడే విధంగా ప్రతి ఇంటికి పది మొక్కలు తక్కువ కాకుండా పెంచడం మరియు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టడం.

**కె.రాజేష్ కుమార్**
**ఎస్ బి ఎం క్లస్టర్ ఫెసిలిటేటర్**
**కలెక్టరేట్ ఆఫీసు, మహబూబ్ నగర్**









# ఇంధనం వృథా – పర్యావరణానికి వ్యథా!

ఇంధనాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిమీదా వుంది. అసలు వ్యర్థమైన ఖర్చులను ఎవరూ, ఎప్పుడూ ప్రోత్సహించకూడదు. అందుకే అడవి కాచిన వెన్నెల, బూడిదలో పోసిన పన్నీరు లాంటి సామెతలు పుట్టుకొచ్చాయి.

“ఇంధనం వృథా – మన పర్యావరణానికి వ్యథ”. ఎందుకంటే మనం శ్రమించాలంటే శక్తి అవసరం. ఏ యంత్రమైనా పనిచేయాలంటే దానికి సరిపడా ఇంధనం కావాలి. పెట్రోల్ లేకపోతే బండి, బస్సూ, ఏదీ కదలదు. విద్యుత్ లేకపోతే, టి.వి, మిక్సీ, రిఫ్రిజిరేటర్లు మొదలనవి పనిచేయవు. ఫ్యూయల్ నిల్ అయితే విమానం నేలమీద కూడా నడవదు. పత్రహరితం కరువైతే మొక్కలు వాడిపోతాయి. వాటికదే ఇంధనం లాంటిది. మొత్తానికి ఇంధనం లేకపోతే జగమే మాయా బతుకే లోయ అవుతుంది. ఇంధనాలను దుబారా చేస్తే డబ్బు దండగే కాకుండా ముందు ముందు ఎవరికీ దొరక్కుండా పోయే ప్రమాదముంది. ఎందుకంటే ఇంధనం అమూల్యమైనది. అందుకు ఇంధనాన్ని ఆచి తూచి వినియోగించుకుని విజ్ఞులు అనిపించుకోండి.

ఇంతకీ ఇంధనాన్ని పొదుపు చెయ్యడమంటే ఏమిటను కుంటున్నారా? వీలైనంత తక్కువ ఇంధనాన్ని ఉపయోగించడమే “ఇంధనం పొదుపు”. ఉదాహరణకి ప్రతి చిన్న పనికి కారు, స్కూటర్ మొదలైన పెట్రోల్, డీజిల్ బండ్లను వాడకుండా సైకిల్ లాంటి వాహనం లేదా కాలినడకన వెళ్లడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల ఆరోగ్యానికే కాకుండా పర్యావరణానికీ కూడా ఎంతో మంచిది. పైగా కాలుష్య బారిన పడకుండా ఉంటాము. పదికాలాల పాటు ఆరోగ్యంగా జీవించవచ్చు.

అలాగే ఫ్యాక్టరీలలో వీలైనంత ఇంధనాన్ని పొదుపు చేస్తూ, ఉత్పాదనను పెంచుకునేందుకు ప్రయత్నించాలి. అనేక సంస్థలు నష్టాల్లో ఉన్నాయంటే, ఏకంగా మూతపడే స్థితిలో ఉన్నాయంటే ఇంధన దుర్వినియోగం కూడా ఒక భాగంగానే చెప్పాలి. ఇంధనాన్ని వ్యర్థంగా ఖర్చు పెట్టడం వల్ల ఉత్పాదక ఖర్చు పెగుతుంది. దానివల్ల ఉత్పత్తి యొక్క ధరని పెంచాల్సి వస్తుంది. తద్వారా వినియోగదరులపై అదనపు భారం పడుతుంది. లేదంటే లాభం తగ్గుతుంది. ఇది కేవలం ఫ్యాక్టరీలకే కాదు, ప్రభుత్వ ప్రయివేటు రంగాలవారికి కూడా వర్తిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థల్లో ఈ దుబారా మరీ ఎక్కువ. ఎందుకంటే గవర్నమెంటు ఖర్చేకదా ! అనే ఫీలింగ్. ఈ భారం మనందరి మీద పడుతుందని గ్రహించరు.

ఇంధనం దుబారా కావడానికి మరొక ముఖ్య కారణం చవకబారు యంత్రాలు, నైపుణ్యం లేని ఉద్యోగులు. సరైన శిక్షణ లేని వారిని పనిలో పెట్టుకోవడం వల్ల ఇంధనం వృధా అయిపోతుంది. కొంత ఖరీదు ఎక్కువైనప్పటికీ ఫ్యూయల్ సేవింగ్ మిషనరీ అమర్చుకోవడం వల్ల ఇంధనాన్ని పొదుపు చేయొచ్చు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. ఇంధన వృధా వల్ల కాలుష్యం పెరిగి మొక్కలు, జంతువులు, సహజ వనరులు దెబ్బతింటాయి. చెట్లు, జంతువుల లేకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకమౌతుంది. నదీ నదాలు ఎండి పోవడం, ఓజోన్ పొరకు మరింత చిల్లులు పడటం లాంటి అనర్థాలు జరుగుతాయి. మనం కష్టాల ఊబిలో కూరుకు పోతాము. వాతావరణ కాలుష్యం, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, మితిమీరిన ఎండలు..లాంటి ప్రమాదాలు ,ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతుంది. కనుక ఇంధనాన్ని పొదుపు చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకుందాం!

**సుజాత.పి.వి.ఎల్**







# సంచార పశువైద్య సేవలు – 1962

61.2% తెలంగాణా ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఇందులో 55.4% (2017, తెలంగాణా గణాంకాల ప్రకారం) ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయం మరియు పశుపోషణపై ఆధారపడి ఉన్నారు. 29.25 లక్షల రైతుకుటుంబాలు పశువులు లేదా కోళ్ళను కలిగి ఉన్నారు. రాష్ట్రంలో తెల్లపశువులు 48.4లక్షలు (14వ స్థానంలో), గేదెలు 41.6లక్షలు (10వస్థానంలో), గొర్రెలు170 లక్షలు (2వస్థానంలో), మేకలు 45.75 లక్షలు (13వస్థానంలో) ఉన్నవి. పశు సంపద నుంచి వచ్చిన ఆదాయము (GVA) 45,260 కోట్లు (2017-18). వ్యవసాయంతోపాటు పశు పోషణ గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. గాంధీగారు ఇలా చెప్పారు. "దేశంలోని పశువుల పరిస్థితిని బట్టి ఆదేశం ఎంత పురోగతి సాధించిందో నిర్ణయించవచ్చును." పశువులకు మెరుగైన సేవలను అందించే ఉద్దేశంతో 15.09. 2017 రోజు సంచార పశువైద్య సేవలను ప్రారంభించడం జరిగింది. రైతు 1962 నెంబరుకు ఫోన్ చేయగానే అతని ఇంటివద్దకే వచ్చి ఉచిత పశువైద్య సేవలను అందించాలనే ప్రాథమిక లక్ష్యంతో తెలంగాణా ప్రభుత్వము GVK అనే అత్యవసర సేవలందించే సంస్థ యొక్క భాగస్వామ్యంతో, ఈ తరహాలో దేశంలోనే ప్రప్రథమంగా ప్రారంభించడం జరిగింది.



**సంచార పశువైద్యశాలల ఆవశ్యకత:-**

తెలంగాణాలో 10,000 పైచిలుకు గ్రామాలు ఉన్నవి. సరాసరిన 5 నుంచి 6 గ్రామాలకు ఒక పశువైద్యశాల చొప్పున సుమారుగా 2010 పశువైద్యశాలలు పశువైద్య సేవలను అందిస్తున్నాయి. ఈ వైద్యశాలల ద్వారా సంవత్సరానికి (2017-18) సుమారుగా 2.5 కోట్ల పశువులకు చికిత్సలు, 5.5 కోట్ల పశువులకు టీకాలు అందించడం జరిగింది. ఇన్ని సేవలు స్థానిక పశువైద్యశాలల ద్వారా అందిస్తున్నప్పటికీ, జబ్బుతో ఉండి లేవలేనిస్థితిలో ఉన్న పశువును దృష్టిలో పెట్టుకొని ప్రారంభించినవే ఈ సంచార పశువైద్య సేవలు.

జబ్బుతో ఉన్న పశువును వైద్యశాలకు తీసుకురావడం అనేది శ్రమతో కూడుకున్నపని. పశువుకు అదనపు శ్రమ అవుతుంది. దీని వలన జబ్బు మరింత పెరిగే అవకాశం ఉంది. డాక్టర్/సిబ్బంది వెళ్ళి చికిత్స చేయాలన్నా తగిన సదుపాయాలూలేవు. సమయానికి చికిత్స అందించలేక పోవచ్చు. దీని వలన రైతుకు మరింత ఆర్థికనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అందుకే వీటన్నిటికీ ప్రత్యామ్నాయంగా ప్రారంభించినవే సంచార పశువైద్యసేవలు.

**సంచారపశువైద్యసేవలరూపకల్పన:-**

మొదటి విడతలో గ్రామీణ నియోజకవర్గానికి

ఒక్కటి చొప్పున మొత్తం 100 వాహనాలతో సేవలను ప్రారంభించారు. ప్రతివాహనంలో ఒకవైద్యుడు, ఒకపారా సిబ్బంది, హెల్పర్ మరియు డ్రైవరు ఉండటం జరుగుతుంది. ప్రతి వాహనంలో పరీక్షలకు మరియు చికిత్సకు అవసరమయ్యే అన్ని పరికరాలు మరియు మందులు సమకూర్చబడినాయి. ఈ సేవలన్నీ ఉచితము. చికిత్స తర్వాత మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది. కృత్రిమ గర్భధారణకు కావలసిన పరికరాలు, రక్తపరీక్షలకు సంబంధించి మైక్రోస్కోప్, టెస్ట్యూబ్లు, కోల్డ్‌స్టోరేజ్, నట్టల పరీక్షలు మరియు వివిధ చికిత్సలకు కావలసిన మందులు ఇందులో అందుబాటులో ఉంచబడినవి. 14.5 లక్షల వ్యయం కలిగిన వాహనాన్ని, వైద్యుడు, ఇతర సిబ్బందితో నిర్వహించడానికి అయ్యే ఖర్చునెలకు 1.88లక్షలు.

**సంచారపశువైద్యసేవలను ఎలా వినియోగించుకోవాలి?**

అత్యవసర పరిస్థితుల్లో, పశువులేవలేనిస్థితిలో ఉన్నప్పుడు, స్థానిక పశువైద్యం అందుబాటులో లేనప్పుడు రైతు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను నమోదు చేసుకొని ఈ ఉచిత సేవలను వినియోగించుకోవచ్చు.

పశువు యొక్క అనారోగ్య లక్షణాలను, రైతు యొక్క పేరు, గ్రామం, మండల మరియు జిల్లా వివరాలను తెలుపవలసి వుంటుంది. సంచార పశువైద్య సేవలు ఉదయం 7 గంటల నుండి పని చేయడం జరుగుతుంది.

**కాల్ సెంటర్ నిర్వహణ**

ఈ కాల్ సెంటర్ హైదరబాద్‌లోని కొంపల్లిలో వుంది. దీనిలో 30 మంది సిబ్బంది కాల్స్ స్వీకరిస్తారు. రైతలకు సత్వర సూచనలు లేదా సలహాలు ఇవ్వడానికి ఇద్దరు పశువైద్యులు



కూడా వున్నారు. రాష్ట్రం మొత్తం నుండి రోజుకి సరాసరిన 3000 కాల్స్ వస్తున్నాయి వీటిలో 1.3% కాల్స్‌కు మాత్రమే సమాధానం అందడం లేదు. ఈ 99 వాహనాల ద్వారా రోజుకి సుమారుగా 1100 నుండి 1200 పశువులకు చికిత్స అందించడం జరుగుతుంది.

ప్రతి వాహనం వారిని యోజకవర్గ పరిధిలో సరాసరిన 6 నుండి7 ట్రిప్పులు రోజుకి తిరుగుతుంది. ఈ సేవల ద్వారా ఇప్పటి వరకు 6.1 లక్షల పశువులకు చికిత్స అందించడం జరిగింది. సుమారుగా 2.3 లక్షల రైతులు లబ్ధి పొందారు.

ఒకనెలలో వచ్చే రోజువారి కాల్స్ యొక్క వివరాలను విశ్లేషించి ఈ విధంగా వర్గీకరించుకోవచ్చు.

1. అత్యవసరసేవలు(60-65%)
2. అనుసరించే (ఫాలోఅప్)సేవలు(15-18%)
3. నిష్ఫలమైనకాల్స్(పనివేళలోకాకుండావచ్చినవి) (7-8%)
4. సైలెంట్ కాల్స్ (8-9%)












5. ERC-VET (సలహాలు/ సూచనలకొరకు)- (5-7%)
6. చైల్డ్ కాల్స్(0.5-1%)

అత్యవసర కాల్స్‌కు మొదట ప్రాధాన్యత ఇస్తూ సంచార పశువైద్యశాలకు ఆ వివరాలను అందించడం జరుగితుంది. రోజుకు 800 నుండి 900 కాల్స్ వాహనాలకు కేటాయించడం జరుగుతుంది. మిగతా అత్యవసర కాల్స్‌ను పశుసంవర్ధక సంచాలకుల కార్యాలయంలోని పర్యవేక్షక విభాగానికి బదిలీచేయడం జరుగుతుంది. ఈ కాల్స్ యొక్క వివరాలను సంబధిత స్థానిక పశువైద్యశాలకు అందిచడం జరుగుతుంది. వచ్చిన అన్ని కాల్స్‌కు సేవలను అందించే విధంగా సంచార పశువైద్య సేవలను విస్తృతపరిచే విధంగా మరిన్ని సంచార పశువైద్య వాహనాలను రెండవ దశలో ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తుంది. రైతు కాల్ చేసి తెలిపే అనారోగ్య వివరాలను విశ్లేషిస్తే ఇవి ముఖ్యంగా, సీజనల్ వ్యాధులు అనగా న్యుమోనియా(14.5-15%) ,అజీర్తి(14%), విరేచనాలు (14%), కుంటడం(12%), జ్వరం(9%), పుండ్లు(8%), పొదుగువాపు వ్యాధి(3.5%), మరియు కష్టతరమైన ప్రసవం (2.4%)గా వున్నవి.

**పర్యవేక్షణ:**

హైదరాబాద్‌లో శాంతినగర్‌లోని పశుసంవర్ధకశాఖ సంచాలకుల కార్యాలయంలో పర్యవేక్షణ విభాగము వుంది. ఇందులో ఒకపశువైద్యురాలు, ఇద్దరు సిబ్బంది వున్నారు. వీరు అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయబడిన డ్యాష్ బోర్డు ద్వారా GPS సహాయంతో వాహనాల పనితీరును పర్యవేక్షించడం జరుగు తుంది. 125.17.108.51/ dashboardnew అనే URL ద్వారా వాహనాల యొక్క స్థానాన్ని గమనించవచ్చు.

**రైతులకుసూచనలు:**

రైతులు గమనించవలసినది ఏమిటనగా తెలంగాణా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, దేశంలోనే మొట్ట మొదటిసారిగా ప్రవేశ పెట్టిన ఈ సేవలను సద్వినియోగపరచుకోవాలి.

1. రైతు సరియైన సమాచారం ఇవ్వాలి.
2. పశువుకుసంబంధించిన రైతు తన చరవాణి నుండి మాత్రమే కాల్ చేసినట్లయితే, తిరిగి సంచార పశువైద్య సిబ్బంది కాల్ చేసినప్పుడు సరియైన సమాచారం ఇచ్చి అందుబాటులో ఉండటానికి వీలుగా వుంటుంది.
3. రైతుకు పశువు యొక్క ఆరోగ్య మరియు అనారోగ్య లక్షణాలపై సరియైన అవగాహనవుండటం ఎంతైనా అవసరము.

**డా.జి.లక్ష్మి**







# ఇంటికో ఇంకుడు గుంత... భూగర్భ జలం మనచెంత



నీరే జీవకోటికి ప్రాణాధారం. తాగునీటి ఎద్దడితో ఏర్పడే సమస్యలు వర్ణనాతీతం. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు నీటి అవసరం ఎంతో ఉంటుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని నీటిని కాపాడుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధిహామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణానికి సాయం అందిస్తూ క్షేత్రస్థాయిలో అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకుంటే భూగర్భజలాలు మన చెంత ఉన్నట్లే. భూగర్భ జలాలను సంరక్షించి భవిష్యత్తు తరాలకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను నిర్మించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. రానున్న రోజుల్లో భూగర్భజలాలు పెరిగి నీటి వనరులు సమృద్ధిగా ఉండే అవకాశం ఉంది.

**నిర్మాణం ఇలా.**

ఇంకుడు గుంతలను లబ్ధిదారుడే స్వయంగా నిర్మించుకోవాలి. 4 అడుగుల పొడువు, 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల లోతు గుంత తవ్వాలి. 3 అడుగుల భాగం వరకు పెద్ద రాళ్లు, మరో 3 అడుగుల వరకు చిన్న రాళ్లతో నింపాలి. 3 ఫీట్ల ఎత్తున్న ట్యాంకును నిర్మించి దానికి రంధ్రాలు చేయాలి. ట్యాంకు చుట్టూ కంకర రాళ్లతో నింపాలి. ఇంటివైపు నుంచి వచ్చే వర్షపు నీరు, ఇంటి అవసరాలకు ఉపయోగించే నీటిని ట్యాంకులోకి వెళ్లేలా పైపులను అమర్చాలి. ట్యాంకుపై సిమెంటుతో చేసిన మూతను కప్పిఉంచాలి. 44 అడుగుల పొడువు, వెడల్పు పాలిథిన్ సంచితో గుంతను మూసేయాలి.

**లాభాలు అనేకం**

100 చదరపు మీటర్ల పైకప్పు ఉన్న ఇంటి ఆవరణలో వర్షం కురిసినప్పుడు ఇంకుడు గుంత ద్వారా 55 క్యూమిక్ మీటర్ల ఘనపరిమాణం గల నీటిని భూమిలోకి ఇంకేలా చేయొచ్చు. ఇది 55 వేల లీటర్ల నీటితో సమానం. రెండు లక్షల యూనిట్లలో వర్షపు నీటిని సేకరిస్తే అది ఐదుగురు సభ్యులున్న రెండు లక్షల కుటుంబాలకు 100 రోజుల నీటి అవసరాలను తీరుస్తుంది.

భూగర్భ జలాలు అడుగంటవు
తాగు, సాగు నీటి సమస్య ఏర్పడదు.
మురుగు రోడ్లపైకి రాదు, దుర్గంధం ఏర్పడదు.
ఈగలు, దోమల సంతతిని నివారించొచ్చు.
మురుగు కాలువల నిర్మాణం అంతగా అవసరం ఉండదు.

క్కో ఇంటిపై కురిసిన వర్షం నీటిని కనుక మనం సంరక్షించుకోగలిగితే కుటుంబానికి ఇరవై రోజులకు సరిపడా నీరు దొరికేది.

హైదరాబాదు లాంటి నగరాల్లో ఏడాదికి 780 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు అవుతుంది. ఒక 100 చదరపు అడుగుల ప్లాటులో, ఏడాది కాలంలో కురిసేవర్షం నీరు దాదాపు 55000 లీటర్లు ఉంటుంది. ఈ నీటినే కనుక మనం ఆదా చేసుకోగలిగితే అయిదుగురు సభ్యులున్న కుటుంబానికి 100 రోజులపాటు సరిపోతుంది. వర్షాకాలంలో పడే వాన నీటిని భూమిలోకి ఇంకేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే మనకు ఎండాకాలంలోనూ సరిపడా నీరు లభ్యం అవుతుంది. ఇంకుడు గుంత ఏర్పాటు చేయడం చాలా స్వల్ప ఖర్చుతో కూడుకున్న పని. మీ ఇంటిలో ఎండిపోయిన బోర్ వెల్ కానీ, బావి కానీ ఉన్నట్టయితే మీరు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవడం ఇంకా సులభం.



వినూత్న పద్ధతిలో ఇంకుడు గుంతల నిర్మాణం



# కొత్తిమీర లాభాల ధార

సుగంద ద్రవ్య పంటల్లో కొత్తిమీర సాగు ప్రధానమైనది. అన్ని కాలాల్లోను సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. రైతులు చలికాలంలోనే కాక వేసవికాలంలో కూడా నీటి వసతి ఉంటే చెట్ల నీడలో, షేడ్‌నెట్, పాలీహౌస్‌లోను సాగు చేసుకోవచ్చు. కొత్తిమీర ద్వారా లభించే ధనియాలు సుగంధ ద్రవ్యాల్లో ఎక్కువగా వినియోగిస్తుండడంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వంటల్లో దీని వినియోగం పెరిగి పోవడంతో చిరు వ్యాపారులకు సైతం ఉపాధి లభిస్తోంది. తక్కువ నీరు, తక్కువ కాలవ్యవధిలో కొత్తిమీర సాగుచేసి లాభాలు ఆర్జించవచ్చు.

**నేలలు:** నల్లరేగడి భూములు, నీటి వసతి కలిగిన గరప నేలలు, ఎర్రనేలతో పాటు తేలికపాటి నేలలు కొత్తిమీరసాగుకు అనుకూలంగా ఉంటాయి. కొత్తిమీర రకాలలో ముఖ్యంగా సింధు, సాధన, స్వాతి, సుధ వంటి రకాలు మంచి లాభదాయకంగా ఉంటాయి. నేలను మెత్తగా కనీసం మూడు, నాలుగు సార్లు దున్ని పెట్టుకోవాలి. సాలు సాలుకు 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా గొర్రుతో విత్తుకోవాలి. విత్తడానికి ముందు ఆరు గంటల వరకు విత్తనాలను నానబెట్టి ఆరబెట్టాలి. ఎకరానికి ఆరు కిలోల విత్తనం అవసరమవుతాయి.

**ఎరువుల యాజమాన్యం:** వర్షాధారం కింద సాగు చేసే నల్లరేగడి భూముల్లో అయితే ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశు వుల ఎరువు, 25 కిలోల యూరియా, క్వింటాల్ సూపర్ ఫాస్ఫేటు వేసుకోవాలి. నీటి పారుదల కింద సాగయ్యే తేలికపాటి నేలల్లో విత్తిన నెల రోజుల్లోనే 12 కిలోల యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. బరువు నేలల్లో అయితే ఎకరానికి సెండిమిథాలిక్ 1.3 లీ. తేలికపాటి నేలల్లో అయితే 200 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**సస్యరక్షణ చర్యలు:**

**పేనుబంక:** గింజలు ఏర్పడకుండా ఆకులతో పాటు రసాన్ని పీల్చి పిప్పి చేస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ లేదా మిథైల్ డెమెటాన్ 2.0 మి.లీ. లేదా డైమిదోయేట్ 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

**ఎర్రనల్లి:** ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చేస్తాయి. దీని నివారణకు 3 గ్రాముల గంధకం పొడిని లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** ఆకులు పూతలో ఉన్న రసాన్ని పీల్చి నష్టం కలిగిస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో ఫిప్రోనిల్ 2.మి.లీ. లేదా డైమిథోయేట్ 2.మిలీ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

**పొగాకు లద్దె పురుగు:** ఆకులు, పూత, గింజలను తిని నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ ఒక గ్రాము కలిపి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** ఆకుల అడుగు భాగంలో కాండంపైన బూడిద రంగులో మచ్చలేర్పడడంతో దిగుబడి తగ్గిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండజిమ్ కలిపి పిచికారి చేయాలి.

**గింజ నలుపు:** పూతదశ నుండి గింజ కట్టే దశలో ఈ తెగులు కనిపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి మాంకోజెబ్ 3 గ్రా. కలిపి పిచికారి చేయాలి.

**అంతర పంటలు:** కొత్తిమీర సాగుతో పాటు ఇతర పంటలు కూడా వేసుకోవచ్చు. ఆవాలు, కుసుమలు, శనగ మిశ్రమ పంటగా వేసుకోవచ్చు.

**కోతలు:** 40 నుండి 45 రోజుల్లో పూత దశకు వస్తుంది. 80 నుండి 110 రోజులకు పక్వానికి వస్తుంది. మొక్కలపై నాణ్యమైన గింజలు ఉన్నప్పుడు పంటను కోయాలి. పంటను ఉదయం లేదా సాయంత్రం కోయాలి.

విత్తన నిల్వ ఉంచాలనుకున్న ధనియాల సంచులపై మలాథియాన్ చల్లడం ద్వారా నిల్వ ఉంచుకోవచ్చు. అప్పుడప్పుడు విత్తనాలను ఎండబెట్టడం వల్ల గింజలను ఆశించే పురుగుల నుంచి రక్షించుకోవచ్చు.

పి.సాధ్వి (విస్తరణ శాస్త్రవేత్త),
డా.ఆర్.ఉమారెడ్డి(సహ పరిశోధనా సంచాలకులు),
బి.మాధవి (సేద్య విభాగ శాస్త్రవేత్త),
ఎస్.నవత (సేద్య విభాగ శాస్త్రవేత్త),
డి.ఏ.రజనీదేవి (ఆర్థిక శాస్త్రవేత్త),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలాస, జగిత్యాల.



# సస్య రక్షణ మందులు మరియు జీవ రసాయనాలకొనుగోలు, వాడకంలో పాటించవలసిన మెళుకువలు

పంటలలో చీడపీడలను సమర్థవంగా నివారించాలంటే సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే మార్కెట్‌లో లభ్యమయ్యే సస్యరక్షణ మందులను వాడుకోవాల్సిన అవసరం ఉంది. కనుక రైతాంగం సస్యరక్షణ మందులు కొనుగోలు, వాడకంలో క్రింద సూచించిన సూచలను ఆచరిస్తే సరియైన మందులను కొనుగోలు చేసి పిచికారి చేయడం వల్ల చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చును.

రైతులు వ్యవసాయ అధికారుల, వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫారసుల మేరకు కల్తీలేని మందులను లైసెన్సు పొందిన డీలర్ల నుంచి సీలున్న డబ్బాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసేటప్పుడు గడువు తేదీని గమనించి, గడువు ఇంకా ఉన్న మందులనే కొనుగోలు చేయాలి.

ప్రతీ పురుగుమందు డబ్బాలపై విధిగా లేబుల్ అలాగే మందుకు సంబంధించిన కరపత్రము ఉండాలి. లేబుల్‌పైన పురుగుమందుకు సంబంధించిన వాడకం పద్ధతి, నిల్వ, అలాగే నాశనం చేసే పద్ధతులను గురించిన సమాచారం గమనించాలి. పురుగుమందు కరపత్రము అలాగే డబ్బాపైన విధిగా/ ఖచ్చితంగా ఈ క్రింది సమాచారం ఉండాలి.

- సస్యరక్షణ మందు పేరు (రసాయన నామం, బ్రాండ్ పేరు/ట్రేడ్ పేరు)
- తయారీదారుని పేరు, చిరునామా
- రిజిస్ట్రేషన్ నెంబరు.
- రసాయన మోతాదు, భౌతికస్థితి
- బ్యాచ్ నెంబరు
- బరువు లేదా నెట్ వెయిట్
- తయారీ తేదీ, వాడుటకు చివరి తేది
- విరుగుడు సమాచారం
- హెచ్చరికల గుర్తులు అలాగే ఎరువుల యొక్క పసుపు
- నీలం లేదా ఆకుపచ్చ త్రిభుజాలు.

**సస్యరక్షణ మందుల వాడకంలో పాటించవలసిన మెళుకువలు:**

- ఆహార పదార్థాలతో పాటు మందులను తీసుకొని పోకూడదు. పొరపాటున మందులు ఆహారపదార్థాలపై పడితే వాటిని తినకుండా పారేయాలి.
- మందులను నీడలో, ఎండ తగలకుండా నిల్వ చేయాలి.
- మందులను నిల్వ చేసే అల్మారాలకు తాళాలు వేసి పిల్లలకు, పెంపుడు జంతువులకు అందుబాటులో లేకుండా చేయాలి.
- ఆహార పదార్థాలతో గానీ, పశువుల మేతతో గానీ, దాణాలతో మందులను కలిపి నిల్వ చేయకూడదు.
- మందు డబ్బా మూతను నోటితో తీయకూడదు.
- మందు ద్రావణాన్ని తయారు చేసేటప్పుడు చేతులకు తొడుగులు (గ్లౌసెస్) ధరించాలి.
- నేరుగా స్ప్రేయరు ట్యాంక్‌లో మందు ద్రావణాన్ని తయారు చేయడం మంచి పద్ధతి కాదు. ముందుగా బకెట్‌లో గానీ, పాత్రలో గానీ నీటిలో సిఫారసు చేసిన మందు మోతాదును కలిపి, మందు ద్రావణాన్ని తయారు చేసుకొని వాడాలి.
- మందును గొట్టాల్లోకి నోటితో పీల్చకూడదు. ఎందుకంటే పొరపాటున మందు కడుపులోకి పోయే ప్రమాదం ఉంది.
- మందులను పిచికారీ చేసేటప్పుడు లేదా చల్లేటప్పుడు చల్లే వ్యక్తి తలపై టోపీ, ముఖానికి మాస్క్, చేతులకు తొడుగులు, కళ్ళజోడు, మిగిలిన శరీర భాగాలకు

పొడగాటి చొక్కా, పాదాలకు బూట్లు ధరించాలి.

- మందులను పిచికారీ చేసేటప్పుడు పొగతాగడం, తినడం, నమలడం వంటివి చేయకూడదు.
- పొరపాటున మందు లేదా మందు ద్రావణం శరీరంలోని భాగాలకు తగిలిన వెంటనే సబ్బు నీళ్ళతో శుభ్రపరచుకోవాలి.
- మూసుకుపోయిన స్ప్రేయరు నాజిల్‌లోనికి నోటితో ఊదకూడదు. సన్నని వైరుతో శుభ్రపరుచుకోవాలి.
- మందులు పిచికారీ చేసే స్ప్రేయరు, బకెట్లు, పాత్రలను నీటితో బాగా శుభ్రపరిచి ఆరబెట్టాలి.
- ఖాళీ మందు డబ్బాలను నేలలో పూడ్చిగానీ, కాల్చిగానీ, నాశనము చేయాలి. ఖాళీ డబ్బాలను నీరు నింపడానికి, ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి ఉపయోగించకూడదు.
- మందు కంటిలో పడితే వెంటనే నీటితో కడిగి వైద్యుడిని సంప్రదించాలి.
- పొరపాటున మందు విష ప్రభావానికి లోనై కళ్ళు తిరగడం, వాంతి వచ్చినట్లవడం, కడుపులో తిప్పడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రథమ చికిత్స చేసి వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాలి.
- వైద్యునికి వాడిన / విష ప్రభావానికి లోనైన మందు వివరాలు తెలిపేందుకు మందు డబ్బాను, వీలైతే దానితో ఉన్న కరపత్రాన్ని కూడా తీసుకుపోయి చూపించాలి.

ఈ మధ్యకాలంలో రసాయనిక పురుగు మందులతో సమానంగా జీవ రసాయనాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. కాబట్టి ఈ జీవ రసాయనాలన్నీ కూడా భారత పురుగు మందుల చట్టంలోకి వస్తాయన్న వాస్తవాన్ని రైతాంగం గమనించాలి. అందువలన జీవరసాయనాల కొనుగోలు సమయంలో సరైన జాగ్రత్తలు పాటించినట్లయితే భవిష్యత్తులో నాణ్యతకు సంబంధించిన సమస్యలు తలెత్తినప్పుడు అమ్మినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనే ఆస్కారం ఉంటుంది.

**జీవ రసాయనాల కొనుగోలు సమయంలో రైతాంగం గమనించవలసిన అంశాలు:**

- కొనుగోలు చేసే సమయంలో జీవరసాయనం ప్యాకెట్ / బాటిల్‌పైన ప్రభుత్వంచే జారీ చేయబడిన సంజీకరణ సంఖ్య మరియు తయారీ లైసెన్స్ ముద్రించబడి ఉన్న విషయాన్ని ధృవీకరించుకోవాలి.
- జీవ రసాయనాన్ని తయారు చేసిన తేదీ మరియు క్షమతలో తేడా రాకుండా ఎప్పటి వరకు వాడవచ్చు అని తెలిపే తేదీలను తప్పనిసరిగా పరీక్షించుకొని కొనుగోలు చేయాలి.



- కొనుగోలు సమయంలో సరైన రశీదును పొంది దానిపై అమ్మిన వారి సంతకం ఉన్నదని నిశ్చితపరచుకోవాలి.
- ఎటువంటి పరిస్థితులలోను సరైన వివరాలు లేని, రశీదు ఇవ్వని నకిలీ జీవ రసాయనాలను కొనుగోలు చేయకూడదు మరియు వాడకూడదు.

**జీవ రసాయనాల వాడకపు విషయంలో రైతులు పాటించవలసిన మెళుకువలు:**

- జీవ రసాయనాలను నేరుగా సూర్యరశ్మి తగిలే ప్రదేశాలలో గాని, తేమ లేక నీరు ఉన్న ప్రదేశాలలోగాని ఉంచరాదు.
- వీలయినంత వరకు ప్యాకింగ్‌ను వాడుకొనే సమయంలోనే తీయాలి.
- (యన్.పి.వి.) వైరస్ ద్రావణాన్ని వీలయినంత వరకు సాయంత్రపు వేళల్లో పిచికారి చేయాలి.
- జీవరసాయనాలను రసాయనిక పురుగుమందులు మరియు తెగుళ్ళ మందులతో కలిపి పిచికారి చేయరాదు.
- ట్రైకోడెర్మా లేకా సూడోమోనాస్ విత్తనశుద్ధి గింజ విత్తుకునే ముందు మాత్రమే చేయాలి.
- సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువ మోతాదు లేదా తక్కువ మోతాదు వాడరాదు.

ఈ మధ్యకాలంలో వివిధ రకాల పేర్లతో అనేక రకాల సస్యరక్షణ మందులు మరియు జీవరసాయనాలు మార్కెట్లో విరివిగా లభ్యమవుతున్నాయి. కాబట్టి రైతులు కొనుగోలు చేసే సమయంలో పైన తెలిపిన అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ అనుమతి పొందిన వాటిని మాత్రమే కొనుగోలు చేసి వ్యవసాయంలో ఆశించిన ఫలితాలను, లాభాలను పొందవచ్చు.


– **కె.శ్రావణి,** వ్యవసాయ విస్తరణ అధికారిణి,
– **జి .వెంకటేష్,** వ్యవసాయ అధికారి, ముస్తాబాద్,
– **కె.మానస,** అసిస్టెంట్ ప్రొఫెసర్

# చిన్న కారు రైతు పర్వతయ్య గొర్రెల కాపరిగా మారిన వైనం

**ఉపోద్ఘాతము / పరిచయం.**

శ్రీ.బైకాని. పర్వతయ్య, తండ్రి పెంటయ్య, గ్రామము ఖైర్ ఖాన్ పల్లి, కేశంపేట మండలం, రంగారెడ్డి జిల్లా. ఈయన రెండెకరాల మెట్ట భూమి గల చిన్న కారు రైతు మరియు ఖాళీ సమయంలో వ్యవసాయ కూలి పని కూడా చేసేవాడు. ఈయన వ్యవసాయం వర్షాధారం.

**వ్యక్తిగత మరియు ఆర్థికపరిస్థితి స్థితిగతులు**

ఈయనకి ఇద్దరు కుమారులు కలరు. పెద్ద కుమారుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈయనకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటూ, వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఇంతకుముందు వీరిరువురు సంవత్సరానికి రూ. 1,50,000/వ్యవసాయము మరియు ఇతర పనుల ద్వారా సంపాదించేవారు.

**సవాళ్లు సమస్యలు మరియు అవకాశాలు**

వారికి సంవత్సరం పొడవునా వచ్చే ఆదాయం ద్వారా కుటుంబం నడవడం కష్టంగా ఉండేది. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ద్వారా గొర్రెల అభివృద్ధి పథకం, గొల్ల, కురుమలకు తీసుకొనివచ్చి, ఈ కులాల వారికి సంఘాలు ఏర్పాటు చేసి, 18 సంవత్సరములు దాటిన కుటుంబ సభ్యులందరినీ సభ్యులుగా చేర్చి అందులో లాటరీద్వారా ఎంపిక చేసి రెండు విడతలుగా 2017-2018 మరియు 2018-2019 సంవత్సరాలకు గానూ గొర్రెల పంపిణీ చేపట్టడం జరిగినది. ఈ పథకం ద్వారా ప్రతి సభ్యునికి రూ. 1,25,000/- రూపాయల విలువైన 20 ఆడ గొర్రెలు మరియు ఒక పొట్టేలు 75% సబ్సిడీ అనగా రూ.93,750/-జరిగింది. ఇందులో లబ్దిదారుని వాటా రూపాయలు 31,250/-. వీటిలో పాటు రూ. 425/- విలువ గల మందులు మరియు రూ.3445/- విలువగల 206.8 కిలోల దాణాను ఒక్కొక్క లబ్దిదారునికి పంపిణీ చేయడం జరిగింది.

ఈ పథకంలో భాగంగా శ్రీ బి. పర్వతయ్యకి తేదీ 30.11.2017 రోజున, కర్ణాటక రాష్ట్రంలోని, చిత్రదుర్గ జిల్లా లోని, చిత్ర నాయకన్ హళ్లి గ్రామం నుండి గొర్రెలను కొనుగోలు చేసి 20 గొర్రెలు మరియు ఒక పొట్టేలును ఒక యూనిట్‌గా ఇవ్వడం జరిగింది. ఈ గ్రామం లో ఈయనతో పాటు ఇంకా 30 మందికి గొర్రెల యూనిట్లు పంపకం చేయడం జరిగింది.

**ప్రస్తుత ఆర్థిక స్థితి -**

లబ్ధిపొందిన యూనిట్లో 20 ఆడ గొర్రెల ద్వారా 18 గొర్రె పిల్లలను 3-4 నెలల తర్వాత పొందడం జరిగింది. అందులో 12 ఆడపిల్లలు, 6 మగ పిల్లలు వచ్చినవి. అందులో నుంచి 6 నుంచి 8 నెలల తర్వాత 6 మగపిల్లలు 4 ఆడ గొర్రె పిల్లల్ని ఒక్కొక్క గొర్రె పిల్లకు, రూ.4000/- చొప్పున అమ్మగా రూ.40,000/-ఆదాయం పొందినాడు. మిగిలిన 8 ఆడ గొర్రె పిల్లల్ని పునరుత్పత్తి కొరకు తన మందలోనే ఉంచాడు. ఈ మందలో మొదటి సంవత్సరము ఎలాంటి మరణాలు సంభవించలేదు. రెండవ సంవత్సరము కూడా ఈ గొర్రెలు కట్టి ఈనడం జరుగుచున్నది. ఇప్పటివరకు 4 గొర్రె పిల్లలు (2 ఆడవి, 2 మగవి) వచ్చినవి. ఈ పథకంలో భాగంగా అతనితో పాటు, తన చిన్న కొడుకుకి కూడా ఒక్క గొర్రెల యూనిట్ పంపిణీ చేయడం జరిగింది. అందువల్ల ఈయన అతని కుమారునివి మరియు అతనివి మేపడం ద్వారా స్వంతంగా గొర్రెల పెంపకం చేపట్టి వాటిపై ఆధారపడి జీవిస్తున్నాడు.

కేశంపేట మండల పశువైద్యాధికారి మరియు రంగారెడ్డి జిల్లా పశు వైద్య & పశుసంవర్ధక శాఖ అధికారి, ఈయన యూనిట్ ని సందర్శించి, అతని యొక్క శ్రమ, అంకిత భావం, యాజమాన్య పద్ధతులను మెచ్చుకొని సాంకేతిక సలహాలు అందించుచున్నారు.

**ఇతర గొర్రెల కాపరులకు సందేశం/పాఠం**

ఈ గొర్రెల కాపరి యొక్క విజయగాధ చూసి, ప్రేరణ పొంది, రెండవ విడత కు గొర్రెలను తీసుకోవలసిన గొర్రెల కాపరులు వారి యొక్క వాటా చెల్లించి సిద్ధంగా ఉన్నారు.

**- డా.పి.అనీల్ కుమార్, స.సం.(ప్ర&వి)**



# పలు తెగల ఆదివాసీల సంస్కృతీ సాంప్రదాయాలు

అనాదిగా ఆహారాన్వేషణ గావిస్తూ ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి మానవ తెగలు వలస పోతుండేవి. సమాజంలో వస్తున్న పలుమార్పుల మూలంగా కొన్ని జాతులు కాలంతో పాటు దూసుకెళ్ళుతూ నాగరికత, సాంకేతికత, కార్పొరేట్ చదువు, వైద్యం అన్ని అందిపుచ్చుకుని నాగరిక జాతులుగా సమాజంలో అవతరించారు.

వారి సంపాదన, అభివృద్ధి పెరిగింది. కానీ నేడు అడవి తల్లినే నమ్ముకుని పోడు వ్యవసాయం చేసుకుంటూ అడవుల్లో దొరికే చింతపండు, విప్పపువ్వు, పట్టుతేనె, తునికాకు, కుంకుళ్ళు వగైరా అటవీ ఉత్పత్తుల్ని గిరిజన సొసైటీలకు విక్రయించి వచ్చిన సొమ్ముతో తమకు కావలసిన వస్తువుల్ని కొంటూ తిరిగి అటవీ నివాసాలకు పోవడం ఈ ఆదివాసీలకు ఆశ తక్కువ దాపరికం తెలియదు. తమ తమ తెగల పరిధిలోనే జీవనం సాగిస్తారు. ఇతరుల పట్ల అనుమానం భయం కలిగి ఉంటారు. ఈ సంచార జాతుల్లో స్నేహశీలత నిష్కపటము, ప్రకృతిని ప్రేమించడం, నిరాడంబరత, నిజాయితీ వంటి ముఖ్య లక్షణాలు కలవు.

భారతదేశంలో అనేక గిరిజన ఆదివాసి జాతులు నివసిస్తున్నాయి. ప్రముఖంగా ఆంధ్రతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అనేకమైన గిరిజన ఆదివాసి సంచార తెగలవారు నివసిస్తుండటం జగమెరిగిన సత్యం.

ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ మొదలైన జిల్లాల్లో ఆంధ్రకు సంబంధించిన తుర్పు గోదావరి జిల్లా శ్రీకాకులం విజయనగరం, విశాఖ ప్రాంతాల అడవుల్లో ఆదివాసిలు నివసిస్తూ ఉండటం గమనించాల్సిన అంశం. వీరిలో అనేక తెగలు, ఉపతెగలు గలవు. వీళ్ళలో కోయలు, చెంచులు, గోండులు బోంద్రె జాతి, కొండదొరలు, కొండారెడ్లు, గదల, సుగాలీ, ప్రధానులు జాతులు వంటి వారు 33 ఆదిమ తెగలు ఉన్నాయి. ఆయా తెగల జీవన విధానం పరిశీలిస్తే ఎన్నో నూతన అంశాలు అవగాహలోనికి వస్తాయి.

**కోయజాతి :-**

చెంచు తెగలో కోయ చెంచులు ఒక ఉపతెగ వీరు ఆంధ్రాలో ఎక్కువ షెడ్యూల్డ్ తెగ జాబితాలో 18వ కులం.

వీరిని జ్యోతిష్యం చెప్పే జాతిగా ఒక ప్రత్యేకతతో చూస్తారు. నాగరికులు వీళ్ళు ఇంద్రావితి, సీలేరు, శబరి గోదావరి నదుల ప్రాంతాలతో పాటు కోరాపుట్, ఖమ్మం, బస్తర్, కరీంనగర్, వరంగల్ రెండు గోదావరి జిల్లాల్లో దట్టమైన అడవుల్లో తూర్పు కనుమలో కనిపిస్తుంటారు. అటవీ ప్రాంతాలలో మూలికలు సేకరించి మైదాన ప్రాంతాలలో విక్రయిస్తూ ఉంటారు. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం, తేనె, వెదురు సేకరించి దగ్గర గ్రామాలలో అమ్ముతారు. కొండల మధ్య పోడు వ్యవసాయం చేస్తారు. అడవిలో లభ్యమయ్యే వెదురుతో తట్టలు, బుట్టలు తయారు చేసి అమ్ముతారు. జొన్న పండిస్తారు. అదే వీరి ప్రధాన ఆహారం కూడా.

వీరిలో మరో శాఖో లేక అనంతర విభాగమో గానీ గొత్తి కోయలని కొందర్ని పిలుస్తుంటారు. వీరి భాష కూడా కోయభాషే 18వ శతాబ్దంలోను బ్రిటీష్ వారు పెట్టిన బాధలు సహించలేక కోపంతో కొండల్లో తలదాచుకున్నారు. నిజాం కాలంలో భద్రాచలం తాలుకాను బ్రిటీష్ వారికి ఇచ్చారు. ఆ నాళ్ళలో 225 కోయ గూడేలు ఉండేవి. వీరిలో రాచకోయ, అరటికోయ, కమ్మర కోయ, కొపుకోయ, సత్తికోయ, లింగకోయ, గొమ్మకోయ వగైరా ఉపజాతులున్నాయి. వీరు పెళ్లిళ్లు మూడ్రోజులు జరుపుకుంటారు. ఈ సందర్భంలో ప్రతి వ్యక్తి ధాన్యాన్ని, మధ్యాన్ని పెళ్ళి కుమార్తె ఇంటికి తీసుకెళ్ళడం ఆచారం, వేసవిలో వీరి వివాహాలు జరుగుతుంటాయి. మనిషి చనిపోతే దహన సంస్కారాలు కూడా విభిన్నంగా జరుగుతాయి. శవాన్ని పాడిపై పడుకోబెట్టి ఆ శవం పక్కనే ధాన్యం, కల్లు, కొత్త బట్టలు, డబ్బు ఉంచుతారు. కాకపోతే గర్భిణులు, పిల్లలు చనిపోతే పాతిపెడతారు.

వీరికో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసుకుని వారి ఆచార వ్యవహారాలు దానిని అనుసరించి ఉండటం విశేషం. ఆ తెగకు మచ్చవచ్చే కట్టుబాట్లను అధిగమిస్తే వారిని వెలి వేస్తారు. ఇట్టి శిక్ష పడ్డవానికి నీళ్ళు కూడా ఇవ్వరు. తప్పు గ్రహించి ప్రశ్చాత్తాప పడితే పెద్దలు అంగీకరిస్తే ఆ శిక్ష నుంచి విముక్తి పొందినట్లే వారి కోయ గూడెం పెద్దని పటేల్ అని రెండవ స్థానంలో గల వ్యక్తిని పెద్ద అని పిలుస్తారు. వీళ్ళలో ఒక్కరు పూజారిగా వ్యవహరిస్తారు. కోయ గ్రామాలలో కొండ దేవత కొలువులు చేస్తారు. ఆ ఉత్సవాలున్నప్పుడు నిప్పుల మీద నడుస్తారు. అడవిలో గల గ్రామ దేవతకు ఆదివారం ఊరికి తెస్తారు. ఆ జాతర ఐదు రోజులు చేస్తారు. ఆ సందర్భంగా జంతు బలులు ఇవ్వడం సహజంగా ఆ సమయంలో కోయలు ప్రతి ఒక్కరూ విల్లంబులు దరించి ఒక పక్షినైనా వేటాడి తేవాల్సి ఉంటుంది. ఆడవారు వెదురు బొంగులను ఊదుతూ వినసొంపుగా పాటలు పాడుతారు. తెలంగాణలో వీరు సమ్మక్క-సారాలమ్మ దేవతలను విశేషంగా కొలుస్తుండటం ప్రత్యేకత




**చెంచులు :-**

వీరు రెండు తెలుగు రాష్ట్రాలలో షెడ్యూల్డ్ తెగల జాతుల్లో 3వ కులం వారిగా పేర్కొన్నారు. కాటి కాపర్లు, ఎరుకలు, బోయ, హరిదాసులు, కోయ, లంబాడీ మొదలైన ఆదిమ జాతుల్లో చెంచులు కూడా ఒక్కరు. వీరు సంచార తెగల్లో పూర్తిగా ఆదివాసి తెగకు చెందిన వారు. నల్లమల ప్రాంతంలో కొండలు, గుట్టలు అడవుల్లో నివసిస్తారు. కృష్ణా తీర ప్రాంతాలైన గుంటూరు, ప్రకాశం, శ్రీశైలం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా అటవీ ప్రాంతాలలో వేల ఏళ్ళపాటు జీవిస్తున్నారు. ప్రస్తుతం 46 మండలాల్లో 34 గూడేలలో 10,768 కుటుంబాల వారు జీవనం సాగిస్తుండటం గమనించదగ్గ విషయం. అటవీ ప్రాంతాల్లో వీరు సామూహికంగా జీవనం సాగిస్తారు. బిక్షాటనకి వేళ్ళేటప్పుడు చేతిలోని ఇత్తటి పల్లెం మోగిస్తూ, పాటలు పాడుతుంటారు.

ఈ పాటలో నరసింహస్వామి, చెంచు లక్ష్మి సంబంధించిన గాథలుంటాయి. అడవి దేవతలతో పాటుగా శ్రీశైలం మల్లన్నని అహోబిలం నరసింహ స్వామిని కొలుస్తుండటం సర్వసాధారణం.

శ్రీశైలం ప్రాంతంలో దారిలో వీరికి కృష్ణదేవరాయలు స్థిరమైన జీవితాన్ని కల్పించినట్లు చరిత్ర చెబుతున్నది. చెంచులు కుక్కల్ని కూడా వేటాడుతారు. నివాసానికి గుడిసెలు వేసుకుంటారు. కత్తి, విల్లంబులు, గుంతలు తవ్వే కర్ర, గొడ్డలి, బుట్టలు ఇవే వీరి ఆస్తిపాస్తులు. చనిపోయిన వ్యక్తులు దేవునిలో లీనమవుతారని వీరి నమ్మకం. దరువుకు తగ్గ నాట్యం చేస్తూ విప్ప సారా సేవిస్తూ మైమరచి పోతారు. అక్క కూతుర్ని మనువాడటం వీరి హక్కు పక్షుల ఈకల్ని కిరీటాలుగా చేసుకొని తలకు దరిస్తారు. పిల్లన గ్రోవిని ఊదుతుంటారు. ప్రభుత్వం వీరికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం విశేషం. బడులు చదువు కోసం పిల్లలకు నిర్మించినారు సర్కారువారు. వీరి గ్రామంను పెంట అంటారు.

**గోండులు :-**

ఆదిమ తెగల్లో గోండు జాతి పెద్దది. వీరు తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్ర, చత్తీస్‌ఘఢ్ రాష్ట్రాలలో అత్యధికంగా కన్పిస్తారు. ప్రముఖంగా ఆదిలాబాద్ ఏజెన్సీలో బాగా ఎక్కువగా ఉన్నారు. ఆంధ్రలో వీరి ఉనికి ఉన్నది. మన ప్రాంతంలో నివసించే వారిని రాజగోండులు అంటారు. వీళ్ళలో సీవెన్ సగా, ఎరవాన్ సగా, నల్వెన్ సగా, నార్వాన్ సగా, అను నాలుగు తెగలు కలవు. కోట్నక్, మాడవి, అరాకా, మిశ్రామ్, సిడం, ఆత్రమ్, తేకమి గెడమ్ షడెవకి శాఖలు ఉన్నాయి. వీరి తెగ దేవతను పెర్సాపేన్ అని పిలుస్తుంటారు. వీరి గ్రామ దేవతగాను అకిపేన్ కుల దేవతతో అన్పచుర్ జంగుబాయి అనే ఉపదేవతను గోండులు పూజించడంతో పాటు వీరి ప్రధాన



పండుగకు దండారి నృత్యం చేస్తారు. డోల్, పార, గుమేలా, డప్పు, కింగ్రి, పెప్రెకాలికోం వీరి ప్రధాన వాయిద్యాలు.

నగోబా జాతర వీరి జాతరలో అతి ముఖ్యమైనది. అది ఆదిలాబాద్ జిల్లాలో గల ఇంద్రవెళ్ళి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో కొలువుదీరి ఉంది. వీరి ఆలయ పూజారిని కటోడ అంటారు ఇంకా గోండులు దీపావళి పోలా పండుగల్ని జరుపుకుంటారు. వీరు అడవుల్లో లభించే తేనె, వనమూలికలు మొదలైన వాటిని సేకరించి అమ్ముకుని జీవిస్తారు.

**బోండాజాతి :-**

వీళ్ళు కొత్త వారిని నమ్మరు. విశాఖ దగ్గర్లోని అరకు లోయ ఒడిస్సా రాష్ట్రములోని మల్కాన్‌గిరి ప్రాంతాలలో ఎక్కువగా అగుపిస్తుంటారు. వీరిని "పోరోజు" అని కూడా పిలుస్తుంటారు. వీరి భాష "రెమో" అటవి ఉత్పత్తులను అమ్ముకోవడం నేడు వీరి జీవినాధారం మన దేశంలో మొత్తం మీద 12 వేల మంది బోండా జాతీయులు నివసిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరు జనపనారతో వారికి కావలసిన వస్త్రాలు కుట్టుకుంటారు. పురుషులు వేటాడుతారు. స్త్రీలు పోడు వ్యవసాయంలో మగవారికి సహాయపడతారు. వీరు వాళ్ళ ప్రాంతం దాటి బయటకి వెళ్ళడం తక్కువ కావలసిన వస్తువుల్ని వస్తుమార్పిడి ద్వారా సమకూర్చు కుంటారు. ఆ పద్ధతిని బిసియంప్రోద అంటారు. రాగి అల్యూమినియంతో తయారు చేసిన రింగులను మెడలలో దరిస్తారు. అపరిచితులు వారి ప్రాంతానికి వెళ్ళితే విషబాణాలతో సంహరిస్తారు.

**కొండరెడ్లు :-**

వీరు తెలుగు భాషే మాట్లాడుతుంటారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పరివాహక ప్రాంతం మరియు ఖమ్మం జిల్లాలో కూడా కొండరెడ్లు ఎక్కువగా వున్నారు. ఆదిమ తెగకు చెందిన వీరిలో నేటికి ప్రాచీన ఆచారాలు, కట్టుబాట్లు కనిపిస్తుంటాయి. వీళ్ళ భాష తెలుగే విడాకులు, వితంతు వివాహాలు సహజం వీరి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఇవే కాకుండా గంగానమ్మ దేవి, భూదేవత, సారాలమ్మ, గుడటమ్మ ఇటువంటి దేవతలను కూడా పూజిస్తారు. వీళ్ళ ప్రధానమైన వృత్తి వ్యవసాయం.

**జాతాపులు:-**

జాతాపులనే గోండు తెగకు అనుబంధ తెగగా చెబుతుంటారు. వీరి ధింసా నృత్యం చేయడంలో ఘటికులు విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం, శ్రీకాకులం ప్రాంతాలలో వీరు ఎక్కువగా నివసిస్తుంటారు. వీరి భాష "జటావు" తో పాటు

వీరు తెలుగు మాట్లాడుతూ వుండటం విశేషం. వీళ్ళలో కోందు, జాతీమ అనే రెండు తెగలున్నాయి మళ్ళీ ఈ రెండింటిలో కోందు తెగ కొంత వరకు అభివృద్ధి సాధించింది. అటవీ తెగల్లో వీరిది విలక్షణమైన తెగ పండుగల్లో కంది పండుగ ముఖ్యమైనది. దేవతారాధన ఉత్సవాలు వారం పాటు వీరు జరుపుకుంటారు. ధింసా నఋ్యం చేస్తారన్నప్పుడు ఇరుకుటుంబాల అంగీకారంతో వీళ్ళ పెళ్ళిళ్లు జరుగుతాయి.

**కొండ దొరలు :-**

వీరినే కొండ కాపులు అని కూడా పిలుస్తుంటారు. చాలా మంది కొండ దొరలు ఉభయ గోదావరి, విశాఖ, శ్రీకాకులం, ఒడిసా సరిహద్దుల్లో వీరు నివసిస్తున్నారు. వీరి జాతిలో ఒంతలు, కొర్ర, సుమేలుంగర్, స్విబి, గూనెర, బిడకోర్, సాంగి, గుటూరి మండలేక, వయిజుకులు, సుర్రెక్ మొదలైన ఉపతెగలు గలవు. వధువును బలవంతంగా ఎత్తుకుపోయి గాంధర్వ వివాహము చేసుకునే ఆచారం వీళ్ళలో ఉన్నది. వీరు మాట్లాడే భాష "కుబి" ఆంధ్ర ప్రాంతం వాళ్ళు తెలుగు, ఒడిస్సా ప్రాంతం వాళ్ళు ఒరియా భాషలన్ని మాట్లాడుతుంటారు. పోడు వ్యవసాయం అటవీ ఉత్పత్తులను విక్రయించడం ద్వారా బ్రతుకులు సాగిస్తారు. వీరు నిసాని జంకర సంకుదేవతలను ఆరాధిస్తారు. చిక్కుడు కొత్త బల్లి పండుగ గంగదేవుడు, చైత్ర పండుగలను వీరు వైభవంగా చేసుకుంటారు. పండుగలో ధింసా నృత్యాన్ని చేస్తారు. దేవతకు జంతుబలి ఇవ్వడం ఆచారం.

**గదబలు :-**

నేడు వీరు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం మరియు ఒడిస్సా నివసించే జాతి వీరికి ఐదుగురు పెద్దలు గల పంచాయతీ వ్యవస్థ ఉంటుంది. ఆ పెద్దల తీర్పే వీరికి శిరోధార్యం. అన్ని తగవులు పంచాయతీలోనే పరిష్కరించుకోవాలి. మగ వారు పోడు వ్యవసాయం చేస్తే, స్త్రీలు నేత వృత్తిలో నేర్పరులు పల్లి పండుగ, మండమ్మ పండుగలు జరుపుకుంటారు. గ్రామ అధిపతిని కుల పెద్ద అంటారు. మత పరకార్యక్రమాల్ని దేసరియా లేక పూజారి నిర్వహిస్తారు ఆదిమ తెగలకు చెందిన వీరు సంప్రదాయపు అలవాట్లు, ఆచారాలు కలిగి ఉంటారు.

**ప్రధానులు :-**

ఆదిలాబాద్ జిల్లాలో గల ముఖ్యమైన గిరిజన తెగ ప్రధానులు. వీరి పూర్వీకులు రాజస్థాన్‌లో ఉద్యోగాలు చేసి అనేక గౌరవ పదవులలో పని చేశారు. దివానులుగా దేవాలయాల్లో పలు పదవుల్లో ఉద్యోగ భాధ్యతలు నిర్వహించిన దాఖలాలున్నాయి. వీరి మాతృభాష గోండి వీరు గోండి ధర్మాన్ని ప్రచారం చేస్తుంటారు. ఇంకా ప్రధానులు గోండి ఇతిహాసాలను, జానపదాలను పాడి వినిపించే కళాకారులు. వీరి గోండి ధర్మ సంస్కృతి ప్రచారం పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకుంటారు. వధువులను ఎత్తుకొని వెళ్ళి పెళ్ళాడటాన్ని దరున్ టాక్‌న అంటారు. వధువుకు వరుడు నచ్చితే అతని ఇంటికి వెళ్తుంది. ఈ విధంగా వెళ్ళడాన్ని శివార్‌దాసచ అని అంటారు. ఇల్లరికానికి పోతే ఘర్ జానై అంటారు. గంధర్వ వివాహాన్ని ఖజాఖో అని అంటారు. విడాకుల్ని కూడా అంగీకరిస్తారు. దురాడి, మండవుస్, బైల్ భీంగామర్మింగ్, అకాడి, జామూర్ అవుస్, నాగపంచమి, పొరబడగా దసర, దీపావళి పండుగలను కూడా ప్రధానులు చేసుకోవడం వీరి ప్రత్యేకత.

**సుగాలీలు :-**

వీరు కష్టజీవులు సుగాలీ నృత్యానికి, ప్రధానుల వినోదాలకు ఒక ప్రత్యేకత ఉంది. వీరనే లంబాడీలు, బంజారాలు అని పిలుస్తుండటం విశేషం. ఏది ఏమైన వీరు తెలుగు రాష్ట్రాలలో, ఒడిస్సా, హర్యానా, కర్ణాటక, బిహార్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ప్రాంతాలలో నివసిస్తున్నారు. చింత దీక్షితులు వీరి మీద ఒక కథ రాయడం విశేషం వీళ్లలో రాజోడ్ పమర్ జాదవ్, ఆదియం చావ్‌న్ వంటి ఐదు ప్రధాన తెగలున్నాయి. వీరి పెళ్ళి పద్ధతులు కొద్దిగా విలక్షణంగా ఉండటం చెప్పుకొదగినవి. వీళ్ళలో ఇళ్ళరికం సంప్రదాయం ఉన్నది. ప్రతి తండాకు అనువంశీకంగా వచ్చే పంచాయతీ పద్ధతి అమలులో ఉంటుంది. పంచాయతీకి ఉండే కుఙ్ణి నాయక్ అని పిలుస్తారు. అన్ని విధాలైన తగాదాలు ఇక్కడే పరిష్కరించుకుంటారు. ఇతర తెగల నుండి కూడా సుగాలీలలో చేరవచ్చును. ఆ విధంగా చేరిన వాళ్ళని జంగడ్ అంటారు.

మనం పెర్కొన్న తెగలే కాకుండా నాగరికత ప్రపంచంలో ఇంకా ఎన్నో ఆదివాసి తెగలు లేకపోలేదు. వారిలో యానాది, తోటి, భిల్లులు, బగతలు, సవర, ఆంధ్ వాల్మీకులు, రెడ్డిదొర, కుమ్మర, పోర్జా, పారంగి, షెర్జాతెగ, కట్టునాయకన్, ముఖదొర, కొండెలు, మన్నెదొర, కోతియాలు అనే ఇంకా కొన్ని అవాంతర తెగలు ఉండనే ఉన్నాయి. ఈ ఆదివాసి గిరిజన ఈ ఆదివాసి గిరిజన సంక్షేమం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక పథకాలు రూపొందించి వారిని ఆదుకునే ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు.

**- డా॥ ఎం. సూర్యనారాయణ రాజు**
హైదరాబాద్

# “మిషన్ భగీరథ”పై టి.ఎస్.ఐ.ఆర్.డి.లో శిక్షణా కార్యక్రమం



తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో ది.28.06.2019న త్రాగునీరు మరియు ప్రజలు భాగస్వామ్యం అనే అంశంపై శిక్షకుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి.ఎస్.ఐ.ఆర్.డి. జాయింట్ డైరెక్టర్ (పిఆర్) శ్రీ పి.రవీందర్, మిషన్ భగీరథ సలహాదారు శ్రీ ఎం.నర్సింగ్‌రావు ఆర్.డబ్ల్యుఎస్ & ఎస్ ఛీఫ్ ఇంజనీర్ శ్రీమతి వినోబాదేవి పాల్గొన్నారు.

టిఎస్ఐఆర్‌డి జాయింట్ డైరెక్టర్ శ్రీ పి.రవీందర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ త్రాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్‌భగీరథ వంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని అమలుపరుస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే ప్రతి నీటి బొట్టునూ మనం సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి నీటి చుక్క విలువ గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. అదే విధంగా చాలా గ్రామాల్లో నీటిని వృధా చేస్తున్నారని నీటి వృధాను అరికట్టవలసిన అవసరం ఉందన్నారు. దీనితో పాటు నీటిని వృదా చేస్తే ఆ నీరు కలుషితంగా మారి వ్యాధులబారిన పడే అవకాశం వుందని దానిపై కూడా ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు. ఒక గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు నడవాలంటే ఆ గ్రామానికి సంపూర్ణంగా నీటిని అందించినప్పుడే అది సాధ్యపడుతుందని వివరించారు. త్రాగునీరు దాని వినియోగంపై ముఖ్యంగా గ్రామపంచాయతీలు శ్రద్ధవహించాలని తెలియజేశారు. చెన్నై, బెంగుళూరు వంటి నగరాలు తాగునీటి సమస్యలతో బాధపడుతున్నాయని ఈ సమస్య తెలంగాణకు లేదని, అందుకారణం కేవలం మిషన్ భగీరథ అని తెలియజేశారు.

అనంతరం ఆర్.డబ్ల్యు.ఎస్&ఎస్ చీఫ్ ఇంజనీర్ శ్రీమతి వినోబాదేవి మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో నీటి వనరులు, మిషన్ భగీరథ పథకం యొక్క ఉద్దేశ్యాలు, నీటి వినియోగం, కుటుంబాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలగు అంశాలతో పాటు రాఘవాపూర్‌లో వున్న మిషన్‌భగీరథ ప్రాజెక్ట్ యూనిట్ క్షేత్ర సందర్శన వుంటుందని వివరించారు. ఈ శిక్షణ పూర్తి అయిన తదుపరి జిల్లా స్థాయిలో వివిధ ప్రజాప్రతినిధులకు, పంచాయతీ ఉద్యోగులకు సమగ్రంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమనంతటనీ నీరు మరియు పారిశుద్ధ్యం విభాగ అధిపతి శ్రీ ఎ.నాగేశ్వర్‌రావు నిర్వహించగా, 10 జిల్లాల నుండి విచ్చేసిన దాదాపు 30 మంది శిక్షకులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ వ్యవస్థ – ఆవిర్భావం



ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక ప్రభుత్వాలకు విశేషమైన ప్రాముఖ్యత ఉంది. ఏ దేశం అయిన స్వయం సంవృద్ధిని సాధించాలంటే ముందు గ్రామాలు పరిపుష్టంగా ఉండాలి. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ మరియు ప్రభుత్వంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారానే దేశం ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందుతుంది. ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది అనే ఉద్దేశ్యంతో స్థానిక సంస్థలు ఏర్పడ్డాయి. ప్రాచీన కాలంలోనే స్థానిక ప్రభుత్వాలను చోళులు ఏర్పాటు చేశారని మనకు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది.

ఆధునిక భారతదేశంలో బ్రిటిష్ పాలనలో 1870లో లార్డ్‌మోయో చేసిన తీర్మానం స్థానిక సంస్థల ఏర్పాటు గూర్చి అతి ముఖ్యమైన ఘట్టం. 1882లో లార్డ రిప్పన్ కాలంలో చేసిన తీర్మానాలను స్థానిక స్వపరిపాలన సంస్థల పట్ల మాగ్నకార్టగా అభివర్ణిస్తారు. అందుకే లార్ట్ రిప్పన్‌ను స్థానిక సంస్థల పితమహుడిగా పేర్కొంటారు.

స్వాతంత్రనంతరం మొదటి పంచరవ్య ప్రణాళిక కాలంలో 1952వ సం॥లో పేదరికం, అసమానతలు, వెనుకబాటుతనం, అణిచివేతలు రూపుమాపడానికి సమాజాభివృద్ధి పథకం (CDP)ను ప్రారంభించడం జరిగింది. ఈ పథకాన్ని జాతీయ విస్తరణ సేవా పథకం (NEP)గా 1953లో దేశమంతా అమలు చేశారు. జాతీయ విస్తరణ సేవా పథకం అమలు తీరును స్థానిక ప్రభుత్వాల పనితీరును అధ్యయనం చేయడానికి 1957 జనవరిలో ప్రణాళిక సంఘ సభ్యుడైన బల్వంత్ రాయ్ మెహత అధ్యక్షతన ఒక కమిటీని నియమించడం జరిగింది. ఈ కమిటీ స్థానిక ప్రభుత్వాలు 3 అంచెలుగా ఉండాలని సూచించింది. అవి 1 గ్రామ పంచాయతీ 2 బ్లాకులు (పంచాయతీ సమితి) 3 జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేయాలని 1958లో తన నివేదికను సమర్పించింది.

ఈ కమిటీ సిఫార్సుల ప్రకారం దేశ అభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం, మూడంచెల వ్యవస్థ, స్థానిక సంస్థలకు ఐదేళ్ళకొకసారి ఎన్నికలు, పార్టీ ప్రతిపాదికన కాకుండా స్వతంత్రంగా ఎన్నికలు నిర్వహించాలి అని గ్రామపంచాయతీ ప్రత్యక్షంగా, పంచాయతీ సమితి మరియు జిల్లా పరిషత్తుకు పరోక్షంగా ఎన్నికలు జరపాలని సిఫార్సులు చేయడం జరిగింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు భారతదేశంలో మొట్టమొదటిసారిగా 1959 అక్టోబర్ 2న రాజస్థాన్‌లోని నాగోర్ జిల్లాలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1959 నవంబర్ 1న రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారు ప్రారంభించారు.

ఆ తరువాత కాలనుగుణంగా వివిధ రాష్ట్రాలు, వివిధ అంచెలలో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశాయి. ఉదా॥కు రాజస్థాన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లు మూడంచెలు ఏర్పాటు చేస్తే తమిళనాడు రెండంచెలు, పశ్చిమబెంగాళ్ నాలుగు అంచెల పంచాయతీ రాజ్ విధానాన్ని ప్రవేశపెట్టాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడంచెల విధానాన్ని పాటిస్తూ 1985లో బ్లాక్‌స్థాయిలో గల పంచాయతీ సమితులను విభజించి పాలన సౌలభ్యం కోసం 10 లేదా 15 గ్రామ పంచాయతీలను కలుపుకొని మండలాలుగా రూపొందించారు. పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడానికి 1992వ సంవత్సరంలో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చారు.

73వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ 9వ భాగంలో 243(ఎ) అధికరణం నుండి 243(2) అధికరణం వరకు గ్రామపంచాయతీల గూర్చి వివరిస్తుంది. మనదేశంలో నూతన పంచాయతీరాజ్ చట్టం 1993 ఏప్రిల్ 24న అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 24ను స్థానిక స్వపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటారు.

**– దొడ్డి కుమార్**
జూకల్, శంషాబాద్, రంగారెడ్డి



# ఇ-వ్యర్థాల ద్వారా దేశానికి పెద్ద అనర్థం

నేడు ప్రపంచం ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం చుట్టూ తిరుగుతోంది. సరికొత్త, అత్యంత ఆధునిక ఎలక్ట్రానిక్ వస్తువులు భారీ మొత్తాల్లో ఉత్పత్తి అవుతున్నాయి. ఆ మేరకు వాటి వ్యర్థాలు పెరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను 'ఇ-వ్యర్థాలు'గా పిలుస్తారు. టెలివిజన్లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, రిఫ్రిజిరేటర్లు, గృహోపకరణాలు తదితరాలకు సంబంధించిన వ్యర్థాలివి. మరీ ముఖ్యంగా సెల్‌ఫోన్లకు చెందిన ఇ-వ్యర్థాల ఉత్పత్తి అత్యధికంగా జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందేకొద్దీ నానాటికీ ఇ-వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువులు ఎక్కువ కాలం మన్నికగా లేకపోవడం కూడా ఇ-వ్యర్థాల పెరుగుదలకు మరో కారణం. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే ఎంత టెక్నాలజీ పెరిగితే అంత ఎక్కువ మొత్తంలో ఇ-వేస్ట్ కూడా పెరుగుతుంది. ఎందుకంటే ఈ రోజు మనం వాడే ప్రతి ఎలక్ట్రానిక్ పరికరం ఏదో ఒక రోజు నిరుపయోగంగా మారుతుంది. ఫలితం ప్రస్తుతం ఉన్న చెత్తను తగ్గించకపోగా.. మరికొంత పెంచుతున్నట్లేనని నిపుణులు చెబుతున్నారు.

నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 1.46 బిలియన్ల స్మార్ట్‌ఫోన్‌లు ఉంటే 2020 నాటికి స్మార్ట్‌ఫోన్లు వినియోగించే వారి సంఖ్య 2.87 బిలియన్లకు చేరనుందట. ఇంతమందికీ మొబైల్ ఫోన్ల సౌకర్యాలు కల్పించాలంటే సెల్‌టవర్ల సంఖ్య కూడా పెంచాలి. అంటే నెట్‌వర్కరింగ్ పరికరాలను కూడా పెంచాల్సి వుంది. ఇక మనదేశంలో రోజు రోజుకీ ఇ-వ్యర్థాల సంఖ్య పెరిగిపోతుంది. ముఖ్యంగా మొబైళ్ల వాడకం అత్యధికంగా ఉన్న దేశాల్లో ఒకటైన మనకు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ప్రతి ఇంటిలో కనీసం ఐదారు ఫోన్‌లు వాడకంలో ఉండడంతో పాటు ఉపయోగం లేకుండా మరో నాలుగైదు ఫోన్లు పడి ఉంటున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇ-వ్యర్థాలు వల్ల భవిష్యత్తులో భారత్ ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొబైల్ ఫోన్‌లే కాక భారత్‌లో పర్సనల్ కంప్యూటర్స్, టెలివిజన్లు వల్ల కూడా ఇ-వ్యర్థాలు






కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్నాయట.

2020 నాటికి భారత్‌లో ఇ-వ్యర్థాలు సంఖ్య 5.2 మిలియన్ల మెట్రిక్ టన్నులకు చేరొచ్చని అంచనా ప్రస్తుతానికి భారత్‌లో 1.8 మిలియన్ టన్నులగా ఉన్న ఇ-వ్యర్థాలు సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగింది. వ్యర్థాలు పెరుగుదలతో 30 శాతం ఉన్న భారత్ వృద్ధి. ఇది భారత్‌కు శుభసూచికం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మొబైల్ ఫోన్ల వాడకం వల్లే ఇ-వ్యర్థాలు విపరీతంగా పెరుగుదల సమస్య తలెత్తిందని ప్రజలందరూ వీలైనంత త్వరగా తమ పాత ఫోన్లను రీసైకిలింగ్‌కు ఇవ్వాలని కూడా ప్రభుత్వం చెబుతుంది. ఐతే దీనిపై విస్తృత ప్రచారం అవసరమని అప్పుడే దేశవ్యాప్తంగా దీనిపై అవగాహన వస్తుందని ప్రభుత్వం భావిస్తుంది. ఇ-వ్యర్థాలు ఇలా అనవసరంగా పడేయటం వల్ల అవి భూమిలోకి వెళ్లి భూగర్భ జలాలను కలుషితం చేస్తాయని దీని ఫలితంగా సారవంతమైన భూమి నిస్సారంగా మారే ప్రమాదముందని నిపుణులు భావిస్తున్నారు. అంతేకాక మొబైల్ వ్యర్థాలు గాలిలో కలవడం వల్ల కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని ఇది మనవాళి మనుగడకు చేటు తెచ్చే విషయమని వారు చెబుతున్నారు.

ప్రపంచ దేశాల్లో ఇ-వ్యర్థాలు నిర్వహణ సక్రమంగా జరగటం లేదు. వీటిని సరైన పద్ధతుల్లో నాశనం చేయుడం లేదు. ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు పునర్వినియోగిస్తున్నారు. మనదేశంలో అయితే ఇ-వ్యర్థాల పునర్ వినియోగం జాతీయ హరిత ట్రైబ్యునల్ ప్రకారం కేంద్ర కాలుష్య నియంత్రన మండలి వద్ద ఎలక్ట్రానిక్ వస్తువులు ఉత్పత్తి సంస్థలు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పనిచేసే కాలపరిమితి దాటాక వెనక్కి తీసుకొని పర్యావరణానికి ముప్పు లేకుండా నాశనం చేయాలి. ప్రతి సంస్థ ఏ ఎలక్ట్రానిక్ వస్తువులను ఎంత పరిమాణంలో ఉత్పత్తి చేసింది, ఎంత విక్రయించింది, పని చేయని స్థితికి చేరుకుంటే కొనుగోలుదారులు వాటిని ఎక్కడ అప్పగించాలి వంటి వివరాలను సంబంధిత రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి తెలియజేయాలి.

అయితే ఇ-వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకురావచ్చు. ఈ పదార్థాలు సాధారంగా ఒక రకమైన పదార్థం నుంచి వస్తాయి. అందువల్లనే వీటిని కొత్త ఉత్పత్తులుగా తీసుకురావచ్చు. పునర్వినియోగంలో సాధ్యమైనంత వరకూ తేగలిగితే ఇ-వ్యర్థాలను కొంతవరకు తగ్గించవచ్చు.

రీసైకిల్‌లో మంచి ఆదాయం ఇ-వ్యర్థాలు నుంచి విలువైన లోహాలను వేరు చేయడం ఇప్పటికే పెద్ద బిజినెస్‌గా మారింది. ప్రతి ఏడాది ఇ వేస్టును రీసైకిల్ చేయడం ద్వారా 62.5 బిలియన్ల సంపద లభిస్తుంది. ఈ మొత్తం కొన్ని దేశాల జీడీపీకి సమానం. అయితే ఇది చాలా రిస్క్ తో కూడుకున్నది. సరైన సౌకర్యాల మధ్య జరగకపోతే.. పర్యావరణానికే కాక మనుషులకు కూడా హాని కల్గించే అవకాశం ఉంది.

**ఇ.ఆర్.బి.నరేంద్రనాథ్‌రావు,**
జాయింట్ డైరెక్టర్ (అడ్మిన్), టిసిపార్డ్



# మల్బరీ సాగుతో కరువుకు చెక్!

కరువు పీడిత ప్రాంతాల్లో మల్బరీ సాగు ద్వారా పట్టు పురుగుల పెంపకం చేపట్టిన రైతులు చక్కని ఆదాయం పొందుతున్నారు. నీటిని తక్కువగా వాడుకునే పద్ధతులను వెతుక్కునే క్రమంలో 'ట్రీ మల్బరీ' పద్ధతి ముందుకు వచ్చింది. ఎకరానికి 650 మల్బరీ చెట్లను తక్కువ నీటితోనే సాగు చేయడం ఈ పద్ధతి ప్రత్యేకత.

పాత కరీంనగర్ జిల్లా, కాటారం,నల్గొండ జిల్లా, మోత్కూరు మండలాల్లో గత కొన్నేళ్లుగా వర్షాలు తగ్గాయి. కరువు తీవ్రత ఎక్కువగా ఉంది. అక్కడి రైతులు ప్రేమ్‌కుమార్, యాదయ్య నీటి ఎద్దడిని తట్టుకొనేందుకు మల్బరీ మొక్కలను పెంచే కొత్త పద్ధతిని గత మూడేళ్ల నుంచి చేపట్టారు. సాధారణంగా మల్బరీ చేలల్లో సాళ్ల మధ్య రెండు అడుగులు, మొక్కల మధ్య రెండు అడుగుల దూరం ఉంచి అధిక సాంద్రతలో సాగు చేయడం రైతులకు అలవాటు.

మొక్కలు నాలుగు అడుగుల ఎత్తు పెరిగే లోపే కట్ చేసి ఆకులను పట్టుపురుగులకు మేతగా వేసేవారు. ఆ మొక్కలకు మళ్లీ ఎరువులు వేసి నీటిని అందించి తదుపరి పంటకు సిద్ధమయ్యేవారు. ఈ క్రమంలో వారానికోసారి మల్బరీ పంటకు నీటిని అందివ్వాల్సిందే. నీటి తడులు ఏమాత్రం ఆలస్యమైనా పంట ఎండిపోయేది. దీనికి భిన్నంగా ఈ రైతులు మల్బరీ మొక్కలను పెద్ద వృక్షాలుగా పెంచే కొత్త పద్ధతిని ఎంచుకున్నారు. అధిక సాంద్రతలో సాగుచేసే మల్బరీ తోటలో సాళ్ల మధ్య అంతర పంటలను సాగు చేసేందుకు వీలుండదు. కానీ, మల్బరీ చెట్ల మధ్యలో కొత్తిమీర, జొన్న, వివిధ రకాల ఆకుకూరలు, పశుగ్రాసం తదితర అంతర పంటలను సాగు చేసుకోవచ్చు. మూడేళ్ల తర్వాత నీరివ్వకపోయినా పర్వాలేదు..

"నాలుగు ఎకరాలో మల్బరీ చెట్లు పెంచుతున్నాం. ఎకరానికి 700 మొక్కలను, 3 అడుగుల లోతులో నాటాము. 3 ఏళ్ల వరకు డ్రిప్‌తో నీరిస్తే తర్వాత నీరివ్వకపోయినా పర్వాలేదు. ఈ చెట్లు పదేళ్ల వరకు మల్బరీ ఆకు దిగుబడినిస్తాయి." అంటారీ రైతులు.

**ఇవీ ఫలితాలు**

1, పత్తి, మొక్కజొన్న పండే ప్రాంతాల్లో మల్బరీ పండించడం వల్ల వీరు సాగునీటిని పొదుపు చేస్తున్నారు. మిగతా పంటల అవసరమైనంత ఎరువులు,నీరు కూడా మల్బరీ కి అవసరం లేదు. చీడ,పీడల సమస్యలు లేవు

2, ఎకరానికి 650 మల్బరీ చెట్లు పెంచితే చాలు..మూడేళ్ల తర్వాత నెలకోసారి నీరిస్తే చాలు

3, ఇతర పంటల సాగులో వాడే నీటిలో 10 నుండి 15 శాతం నీటితోనే మల్బరీ తోటలు సాగు చేసుకోవచ్చు.

కరువు పీడిత ప్రాంతాల రైతులకు ఈ సాగు ఎంతో ప్రయోజనం

– కె. పూర్ణిమ

# టి.ఎస్.ఐ.ఆర్.డి.లో గిరిజన ప్రాంత సర్పంచులకు పెసా చట్టంపై శిక్షణా కార్యక్రమం




తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ టి.ఎస్.ఐ.ఆర్.డి. లో ది.22.07.2019 నుండి 27.07.2019 వరకు గిరిజన ప్రాంత సర్పంచులకు పెసా చట్టంపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడితున్నవి. ఈ కార్యక్రమంలో భాగంగా ది.25.07.2019న ప్రారంభమైన 2వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమానికి హాజరైన టిఎస్ఐఆర్డి జాయింట్ డైరెక్టర్ (పి.ఆర్) శ్రీ పి.రవీందర్ గారు పాల్గొని సర్పంచుల్ని ఉద్దేశించి శిక్షణ యొక్క ఉపయోగాలు గూర్చి వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసా చట్టంలో వున్న నియమ నిబంధనలు, చట్ట ప్రకారంగా, రాజ్యాంగ బద్దంగా ఇవ్వబడిన అధికారులను, విధులను చట్టములకు లోబడి గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తూ గిరిజన సాంప్రదాయ సంస్కృతిని కాపాడాలని సూచించారు. పెసా చట్టంలో అన్వయించిన గ్రామసభ అధికారాలను, గిరిజన భూములు అన్యాక్రాంతము కాకుండా చిన్నతరహా ఖనిజాలు, అటవీ ఉత్పత్తులపై అధికారము మొదలగు అన్నింటి విషయంలో పెసా గిరిజన సర్పంచులు అధికారము ఉపయోగించుకుని గిరిజనాభివృద్ధికి తోడ్పడాలని వివరించారు.

ఈ శిక్షణా కార్యక్రమునకు తెలంగాణలోని గిరిజన ప్రాంత జిల్లాలైన కోమరంభీం అసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల నుండి 120 మంది (ఇందులో 50% మహిళలు) గిరిజన ప్రాంత సర్పంచులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సిడిపిఏ సెంటర్ హెడ్ శ్రీ సూర్యారావు, కోర్స్‌డైరెక్టర్ శ్రీ బి.లంబగిరిస్వామి, పాకల్టీ సభ్యులు శ్రీ ఎస్.శంకరయ్య, శ్రీ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

Published by: Pausumi Basu, IAS Chief Executive Officer, on behalf of TSIRD,Govt. of Telangana, Hyderabad.



రంగారెడ్డి జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో టి.ఎస్.ఐ.ఆర్.డిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో
పాల్గొన్న కార్మిక, మరియు మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి శ్రీ సి.హెచ్. మల్లారెడ్డి మరియు
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ లోకేష్ కుమార్ ఐఏఎస్



స్వయం సహాయక బృందాల సభ్యుల యొక్క వ్యక్తిగత మార్పు ఆరోగ్యం, పౌష్టికాహారం, శుభ్రత అనే అంశాలపై టిఎస్ఐఆర్‌డిలో జరిగిన
శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సెర్ప్ ముఖ్యకార్యనిర్వహణాధికారి శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్



గిరిజన ప్రాంత సర్పంచ్‌లకు పెసా చట్టంపై టిఎస్ఐఆర్‌డిలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న
టిఎస్ఐఆర్‌డి జాయింట్ డైరెక్టర్ (పి.ఆర్) శ్రీ పి. రవీందర్

Published on 05-08-2019 Sthanika Paalana RNI No.APTEL/27888/2009.



# 73వ స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు

తాజా సమాచారం కోసం www.tsird.gov.in

మరియు YouTube facebook /tsird